


# విభారే
తెలుగు దినపత్రిక
VIBHARE TELUGU DAILY






PUBLISHED FROM KURNOOL ఎడిటర్: ఆవుల విజయ భాస్కర రెడ్డి ఆదివారం 20 మార్చి 2022 సంపుటి: 03 సంచిక: 191 పేజీలు: 4 వెల: రూ 3-00


## వలసవాద మైండ్ సెట్ మార్చుకోవాలి : వెంకయ్యనాయుడు

హైదరాబాద్: దేశ ప్రజలు వెంటనే వలసవాద మైండ్‌సెట్ నుంచి బయటపడాలని ఉప రాష్ట్రపతి వెంకయ్య నాయుడు సూచించారు. వసల వాద మైండ్ సెట్ నుంచి బయటపడి, సొంత అస్తిత్వవాదం వైపు మొగ్గు చూపాలని హితవుపలికారు. మెకాలే విద్యా విధానాన్ని పూర్తిగా తిరస్కరించాలని, ఆంగ్ల మాధ్యమాన్ని తీసుకొచ్చి, విద్యను కొందరికే పరిమితం చేశారని అన్నారు. హరిద్వార్‌లోని సంస్కృతి విశ్వ విద్యాలయంలో జరిగిన కార్యక్రమంలో ఆయన పాల్గొన్నారు. వసల పాలకులు మనల్ని మనం తక్కువ చూసుకునేలా చేశారు. మన మూలాలు మరిచిపోయేలా చేశారు. దీంతో మన దేశ ఎదుగుదలే మందగించింది. విదేశీ మాధ్యమాన్ని



తీసుకొచ్చి, విద్యను కొన్ని వర్గాలకే పరిమితం చేశారు. చాలా మంది విద్యకు దూరమవుతున్నారు. అంటూ వెంకయ్య నాయుడు ఆవేదన వ్యక్తం చేశారు.మన సంస్కృతిని, వారసత్వాన్ని చూసి గర్వపడాలని ఉప రాష్ట్రపతి వెంకయ్యనాయుడు అన్నారు. మన మూలాలకు తిరిగ వెళ్లాల్సిందేనని సూచించారు. మన వారసత్వాన్ని చూసి పిల్లలు గర్వపడేలా వ్యవహరించాలని, వీలైనన్ని భాషలు నేర్చుకోవాలని వెంకయ్య నాయుడు సూచించారు.

## సిఎం జగన్ ఆశయాల మేరకు పనిచేయండి

### గ్రామస్వరాజ్యసాధన దిశగా ముందుకు సాగాలి
### ఎంపిటిసిల శిక్షణలో మంత్రి పెద్దిరెడ్డి రాంచంద్రారెడ్డి

చిత్తూరు,మార్చి19 రాష్ట్ర ముఖ్యమంత్రి వై.ఎస్.జగన్ మోహన్ రెడ్డి ఆశయాలకు అనుగుణంగా గ్రామ స్వరాజ్య సాధన దిశగా ఎంపిటిసిలు పనిచేయాలని రాష్ట్ర పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ మాత్యులు పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి పేర్కొన్నారు. శనివారం పుంగనూరు నియోజక వర్గం చౌడేపల్లి మండలం ఎంపీడీవో కార్యాలయంలో ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర స్థాయి ఎంపీటీసీ సభ్యులు,మండల కో-ఆప్షన్ సభ్యుల శిక్షణా కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ స్థానిక సంస్థలను అభివృద్ధి చేయుటకు రాష్ట్ర ముఖ్యమంత్రి ప్రత్యేక దృష్టి సారించి అందుకు అనుగుణంగా శిక్షణా కార్యక్రమాలను నిర్వహించి వారి బాధ్యతలపై వారికి అవగాహన కల్పించేందుకు చర్యలు చేపట్టడం జరిగిందనన్నారు. తద్వారా గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి మార్గం సులభతరం అవుతుందన్నారు.ఇది వరకే ఒక లక్ష 30 వేల మంది వార్డు సభ్యులకు,13 వేల 86 మంది సర్పంచులకు శిక్షణ ఇవ్వడం జరిగిందన్నారు. నియోజకవర్గం లోని ఎం.పి.టి.సీలందరికీ ఒక చోట శిక్షణా కార్యక్రమ నిర్వహణ కు చర్యలు చేపట్టామన్నారు. ఎంపిపీలకు ప్రత్యేకంగా ఏప్రిల్ 11 నుంచి మూడు రోజులు శ్రీకాళహస్తి, బాపట్ల, సామర్లకోటలలో శిక్షణ ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. జడ్పీటీసీలకు కూడా వారి విధి నిర్వహణకు సంబంధించి శిక్షణా కార్యక్రమాలను నిర్వహించనున్నట్లు తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి మహిళలకు పెద్ద పీట వేస్తూ స్థానిక సంస్థలలోనూ, వివిధ కార్పొరేషన్ లలోనూ 50 శాతం పదవులను ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు ప్రత్యేకంగా కేటాయించడం జరిగిందన్నారు. గ్రామస్వరాజ్య సాధనకు 2000 జనాభాకు ఒక సచివాలయంను ఏర్పాటు చేసి ప్రజల సమస్యల పరిష్కారానికి చర్యలు చేపట్టారన్నారు.గతంలో ఎప్పుడూ లేని



విధంగా 50 శాతం మంది మహిళా సభ్యులు ఉన్నారని తెలిపారు మంత్రి పెద్దిరెడ్డి.. ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు 50 శాతం పదవులు ఇచ్చిన ఘనత సీఎం జగన్‌కే దక్కుతుందన్న ఆయన.. గ్రామ స్వరాజ్యం అంటూ మహాత్మా గాంధీ చెప్పిన విషయాన్ని చేసి చూపిన వ్యక్తి వైఎస్ జగన్ మోహన్ రెడ్డే అన్నారు.. ప్రతి 2000 మందికి సచివాలయం ఏర్పాటు చేశారు.. సచివాలయ వ్యవస్థలో ప్రజాప్రతినిధులు అందరూ భాగస్వాములే.. ఇదే విషయం అన్ని సచివాలయాలకు తెలియజేస్తామన్న ఆయన.. గ్రామాల పరిశుభ్రతపై ఎంపీటీసీ సభ్యులు శ్రద్ధ వహించాలని.. ప్రతీ పంచాయతీకి ట్రాక్టర్ ఇస్తున్నాం, అందరూ శ్రద్ధ తీసుకుని చెట్లు నాటించాలని సూచించారు.. ఇబ్బందులు ఏమైనా ఉంటే వెంటనే అధికారుల దృష్టికి తీసుకురావాలి.. ఎంపీటీసీలు చేసే అభివృద్ధి గ్రామాల్లో గుర్తుండి పోవాలని మంత్రి పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి అన్నారు. త్రాగునీరు, రహదారులు,మౌలిక వసతులు లపై ప్రత్యేక దృష్టి పెట్టి పారిశుద్ధ్యానికి సంబంధించిజగనన్న స్వచ్ఛ సంకల్పం, మున్సిపాలిటీలలో క్లాప్ కార్యక్రమం మంచి ఫలితాలను ఇస్తున్నదన్నారు. ప్లాంటేషన్ పైన సర్పంచులు ప్రత్యేక దృష్టి పెట్టి మొక్కలను కాపాడాలన్నారు. గ్రామాలలో ఇంటింటికీ మరుగుదొడ్లు ఉన్నప్పటికీ వాటిని పూర్తి స్థాయిలో వాడుకలోకి తీసుకుని వచ్చే విదంగా ప్రజలలో అవగాహన కల్పించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ పథకాలను ప్రజలకు చేరువ చేస్తూ రాష్ట్ర ముఖ్యమంత్రి ఆశయాలకు అనుగుణంగా ఎంపిటిసి లు పనిచేయాలని తెలిపారు. గ్రామాల సమగ్రాభివృద్ధిలో ఎంపిటిసీలు బాగస్వామ్యమై ప్రభుత్వానికి మంచి పేరు తీసుకురావాలన్నారు.

## జమ్మూ కశ్మీర్ భద్రతపై అమిత్ షా సమీక్ష



జమ్మూ కశ్మీర్ భద్రతపై రక్షణ శాఖ ఉన్నతాధికారులతో కేంద్ర హోం మంత్రి అమిత్ షా సమీక్ష నిర్వహించనున్నారు. పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో పెరుగుతున్న తీవ్రవాద కార్యకలాపాలు, చొరబాటుదారుల ఏరివేత, తీవ్రవాదాన్ని సమర్థంగా ఎదుర్కొనే అంశాలపై ఆయన ప్రధానంగా చర్చిస్తారు. జమ్ముకశ్మీర్‌లో పాకిస్తాన్ ప్రేరేపిత తీవ్రవాదాన్ని భద్రతాదళాలు సమర్థంగా అణచివేస్తున్నాయి. అయితే, సరిహద్దు రేఖ వెంబడి పేలుడు పదార్థాలు మనదేశంలోకి అక్రమంగా రవాణా అవుతున్నాయి. రాడార్ల కళ్లుగప్పి, డ్రోన్ల ద్వారా పేలుడు పదార్థాలు దేశంలోకి చేరుతున్నాయి. గడిచిన మూడు నెలల్లో స్థానిక పోలీసులు, పారా మిలిటరీ దళాలు, ఆర్మీ కలిసి పలువురు తీవ్రవాదుల్ని అంతమొందించినప్పటికీ, లష్కర్-ఇ-తయిబా, జైష్-ఇ-మొహమ్మద్ గ్రూప్‌లకు చెందిన తీవ్రవాదులు ఇంకా యాక్టివ్‌గానే ఉన్నట్లు సమాచారం. ప్రస్తుతం పేలుడు పదార్థాలు సరిహద్దు దాటి రాకూడదంటే, యాంటీ డ్రోన్ ఎక్విప్‌మెంట్ సైన్యానికి అవసరం. అమిత్ షా వీటన్నింటిపై చర్చిస్తారు.

## సీమ అభివృద్ధికి ఏం చేశారో చెప్పండి

### ఎపిలో జగగన్ అరాచక పాలన సాగుతోంది.
### సీమప్రాజెక్టులకు కేటాయింపుల్లో నిర్లక్ష్యం
### కడపలో కిషన్ రెడ్డి వ్యాఖ్యలు




కడప,మార్చి19 : రాయలసీమ అభివృద్ధికి జగన్ ఏం చేశారో చెప్పాలని కేంద్రమంత్రి కిషన్ రెడ్డి డిమాండ్ చేశారు. రాయలసీమ రణభేరిలో పాల్గొన్న కిషన్ రెడ్డి.. జగన్ ఆరాచక పాలనతో ప్రజలు ఇబ్బందులు పడుతున్నారన్నారు. రాయలసీమ అభివృద్ధి కోసం మోదీ ఎంతో చేశారని చెప్పారు. సీమ అభివృద్ధికి అంకితభావంతో పని చేస్తామని తెలిపారు. కొత్తగా ఏర్పడిన రాష్ట్రం జగన్ హయాంలో కునారిల్లుతోందని కిషన్‌రెడ్డి మండిపడ్డారు. సీమలో ఏ ప్రాజెక్టులూ పూర్తికాలేదని.. కొద్దిపాటి నిధులిస్తే పూర్తయ్యేవని సోము వీర్రాజు అన్నారు. కడపలో రాయలసీమ రణభేరి సభ నిర్వహించేందుకు కమలనాథులు చేరుకున్నారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ సీమలో పెండింగ్ ప్రాజెక్టులపై రాష్ట్ర ప్రభుత్వ వైఖరిని ఎండగట్టారు. రాయలసీమ అభివృద్ధి, ప్రాజెక్టులకు నికర జలాల కేటాయింపు, పెండింగ్ ప్రాజెక్టు సాధన కోసం వరుస ఆందోళనలు చేపట్టే దిశగా కార్యాచరణ ప్రకటించనున్నారు. రాయలసీమ విషయంలో తమ పార్టీ వైఖరి ఏమిటో మరోసారి స్పష్టం చేయనున్నారు. రాయలసీమ రణభేరి సభలో పెండింగ్ ప్రాజెక్టులు, రైతుల సమస్యలపై ప్రభుత్వాన్ని నిలదీస్తామంటున్నారు. సాగునీటిపారుదల శాఖకు బడ్జెట్‌లో సరైన కేటాయింపులు జరగలేదన్నారు. బిందు సేద్యం పరికరాల్లేక రైతులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని మండిపడ్డారు. ప్రతి విభాగంలో అరాచాకాలు, దౌర్జన్యాలు ఎక్కువయ్యాయని ధ్వజమెత్తారు. జగన్ ప్రభుత్వం అమలు చేస్తున్న ప్రజా వ్యతిరేక విధానాలను ప్రజల్లోకి తీసుకెళ్లేందుకు రణభేరి సభ నిర్వహిస్తున్నట్లు చెప్పారు. కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, పార్టీ జాతీయ కార్యదర్శి వై.సత్యకుమార్, రాష్ట్ర అధ్యక్షులు సోమూ వీర్రాజు, ఇతర ఎంపీలు, రాయలసీమ బిజెపి నాయకులు ఈ సభలో పాల్గొనున్నారు.

## ఆంధ్రా- కర్ణాటక సరిహద్దు వద్ద ప్రమాదం..

### పలువురి మృతి!

ఆంధ్రా- కర్ణాటక సరిహద్దు వద్ద ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఓ ప్రైవేట్ బస్సు బోల్తా పడిన ఈ ఘటనలో ఎనిమిది మంది మృతి చెందినట్లు ప్రాథమిక సమాచారాన్ని బట్టి తెలుస్తోంది.అయితే ప్రమాద తీవ్రతను బట్టి చూస్తే మృతుల సంఖ్య



పెరిగే అవకాశం ఉంది. కర్ణాటకలోని పావగడ పలవలహల్లి వద్ద ఈ ప్రమాదం జరిగింది. వై.ఎన్.హ్వానకోట నుంచి పావగడకు బస్సు వెళ్తుండగా అదుపుతప్పి బోల్తాపడింది. ప్రమాదంలో గాయపడిన వారిని స్థానిక ఆస్పత్రికి తరలించారు.ఓవర్‌లోడ్‌తో వెళ్తున్న బస్సు టాప్‌పై ఎక్కువ మంది డిగ్రీ విద్యార్థులున్నట్లు సమాచారం. మృతుల్లో టాప్‌పై నుంచి దూకిన వారే ఎక్కువగా ఉన్నట్లు తెలుస్తోంది.ప్రమాదంలో ఏపీకి చెందిన షాన్‌వాజ్(20) మృతి చెందారు. కంబదూరు మండలం బెస్తరపల్లిలో ఇతను మెకానిక్‌గా పని చేసేవాడని గుర్తించారు. మృతుల్లో కర్ణాటక వాసులు అమూల్య(20), అంజిత్(23), కల్యాణ్(27) ఉన్నట్లు పోలీసులు తెలిపారు.

## ప్రత్యర్థి పార్టీల వ్యూహాలు తెలుసుకునేందుకే చంద్రబాబు పెగాసస్ కొన్నారు: అబ్బయ్య చౌదరి

ఏలూరు: ఏపీలో పెగాసస్ దుమారం కొనసాగుతోంది. చంద్రబాబు హయంలో పెగాసస్ వాడకంపై పశ్చిమ బెంగాల్ సీఎం మమతా బెనర్జీ కీలక వ్యాఖ్యలు చేసిన విషయం తెలిసిందే. తాజాగా పెగాసస్ అంశంపై వైఎస్ఆర్‌సీపీ దెందులూరు ఎమ్మెల్యే అబ్బయ్య చౌదరి స్పందించారు. శనివారం ఆయన మీడియాతో మాట్లాడుతూ.. " పెగాసస్ ద్వారా ఎవరి ఫోన్‌నైనా టాప్ చేయవచ్చు. మన ఫోన్‌లో



డేటాను పూర్తిగా పరిశీలించవచ్చు.. ఈ శాతాబ్దంలోనే అతి పెద్ద స్కామ్ ఇది.. మా ఫోన్లు హ్యాక్ చేస్తున్నారని గతంలోనే గ్రహించాం. పెగాసస్ స్పైవేర్‌తో రాష్ట్ర ప్రజలను చంద్రబాబు నాయుడు మోసం చేశారు.. అధికార దాహంతోనే ఎలాంటి కుట్రకైనా పాల్పడే వ్యక్తి చంద్రబాబు.. ప్రత్యర్థి పార్టీల్లో ఏం జరుగుతుందో తెలుసుకునేందుకే పెగాసస్ కొన్నారు.. గతంలో చంద్రబాబుతో రాజకీయంగా జతకట్టిన మమతా బెనర్జీనే పెగాసస్ గురించి చెప్పారు". అని అన్నారు.

## సర్వోదయ సంకల్ప పాదయాత్రలో పాల్గొన్న శైలజనాథ్



హైదరాబాద్ సర్వోదయ సంకల్ప పాదయాత్రలో ఆంధ్ర ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ అధ్యక్షుడు డాక్టర్ సాకే శైలజనాథ్ పాల్గొన్నారు. ప్రస్తుతం పాదయాత్ర మెదక్ జిల్లా లోని కాళ్లకల్‌కు చేరుకుంది. ఈ సందర్భంగా శైలజనాథ్ మాట్లాడుతూ రాహుల్ గాంధీ నాయకత్వం లో కాంగ్రెస్ పార్టీ బలోపేతం చేయడానికి ప్రతి కార్యకర్త సన్నద్ధం కావాలని పిలుపునిచ్చారు. మత తత్వ పార్టీలకు బుద్ధి చెప్పేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారని ఆయన స్పష్టం చేశారు.భూదాన్ ఉద్యమానికి 75 ఏళ్లు పూర్తయిన సందర్భంగా కాంగ్రెస్ మధ్యప్రదేశ్ నాయకురాలు మాజీ ఎంపీ మీనాక్షి నటరాజన్ చేపట్టిన సర్వోదయ సంకల్ప పాదయాత్ర మెదక్ జిల్లా మనోహరాబాద్ మండలం కాళ్లకల్ కు చేరుకుంది. దేశంలోని దళితులు, గిరిజనులతో పాటు మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను తెలుసుకోవడానికి మీనాక్షి నటరాజన్ ఈ పాదయాత్ర చేస్తున్నారు. ఆమెకు పలు రాష్ట్రాల కాంగ్రెస్ నేతలు మద్దతు తెలుపుతున్నారు.ఈ పాదయాత్రలో పాల్గొన్న సందర్భంగా శైలజనాథ్ మీడియాతో మాట్లాడుతూ తెలంగాణలో రైతులు, దళితులు, గిరిజనులతో పాటు మహిళలు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రస్తావించారు. తెలంగాణ ప్రభుత్వం తీసుకొచ్చిన ధరణి పోర్టల్‌తో రైతులు సమస్యలు ఎదుర్కొంటున్నారని చెప్పారు. మరోవైపు, టీఆర్ఎస్ ప్రభుత్వం మల్లన్న సాగర్, కొండపోచమ్మ ప్రాజెక్టుల పేర్లతో రైతుల నుంచి భూములు లాక్కుందని ఆరోపించారు. తెలంగాణ సీఎం కేసీఆర్ తన బంధువు కోసమే కొండ పోచమ్మను రీడిజైన్ చేశారని అన్నారు. ఆ ప్రాజెక్టు నుంచి నీరు కేసీఆర్ ఫాంహౌస్‌కు మాత్రమే వెళ్తున్నాయని తెలిపారు. ఆర్ఆర్ఆర్ (రీజనల్ రింగ్ రోడ్డు) పేరుతో ఇప్పుడు మళ్లీ భూములు లాక్కొనే ప్రయత్నాలు చేస్తున్నారని ఆయన ఆరోపించారు. రైతుల నుంచి రూ.3 కోట్ల విలువైన భూములను లాక్కుని రూ.10 లక్షలు ఇస్తామని చెబుతున్నారని మండిపడ్డారు. రైతులను వరి పండించకూడదని చెప్పిన కేసీఆర్ తన ఫాంహౌస్‌లో మాత్రం వరి పండించారని చెప్పారు. కేసీఆర్ పాలనలో రైతుల భూమికి విలువలేకుండా పోయిందని చెప్పారు.తెలంగాణలో ప్రభుత్వం రైతు రుణమాఫీ చేయట్లేదని చెప్పారు. ఇంటికో ఉద్యోగం, మూడెకరాల భూమితో పాటు డబుల్ బెడ్రూం ఇళ్లు ఇస్తామని తెలంగాణ ముఖ్యమంత్రి కేసీఆర్ మోసం చేశారని, ఆయనను ప్రజలు తిరస్కరించే రోజులు దగ్గరపడ్డాయని శైలజనాథ్ మండిపడ్డారు.

## తిరుమల ఘాట్‌రోడ్డులో రన్నింగ్ కారు మంటలు

చిత్తూరు: తిరుమలకు వెళ్లే రెండో ఘాట్ రోడ్డులో రన్నింగ్ కారులో మంటలు చెలరేగాయి. విద్యుత్ షార్ట్ సర్క్యూట్ కారణంగా కారులో మంటలు ఎగసిపడ్డాయి. ఒక్కసారిగా చెలరేగిన మంటలతో కారు అక్కడికక్కడే దగ్ధం అయింది. శ్రీవారి దర్శనానికి వెళ్తుండగా చివరి మలుపులో ఈ ప్రమాదం జరిగింది. కారు డ్రైవర్ అప్రమత్తమవడంతో భక్తులు సురక్షితంగా బయటపడ్డారు. ప్రమాదం నుంచి బయటపడ్డ వారిని కర్నూలుకు చెందిన మహేశ్వర్‌రెడ్డి, సుజాతగా గుర్తించారు.



## పన్నులభారం మోపడంలో కొత్తపుంతలు తొక్కుతున్న వైసీపీ: దేవినేని

అమరావతి: వైసీపీ సర్కారు, సీఎం జగన్మోహన్‌రెడ్డిపై టీడీపీ నేత దేవినేని ఉమామహేశ్వరరావు ట్విట్టర్ వేదికగా తీవ్ర విమర్శలు గుప్పించారు. "పన్నుల భారం మోపడంలో వైసీపీ సర్కార్ కొత్తపుంతలు తొక్కుతోంది. రెండు వారాల్లో వెయ్యికోట్ల ఆస్తి, చెత్తపన్ను వసూలు చేయాలని ఒత్తిడి తెస్తున్నారు. జగన్‌కి ఒక్కఛాన్స్ ఇచ్చిన ప్రజల జేబులు కొల్లగొట్టడంపై పెట్టిన శ్రద్ధ సంపద సృష్టించడంపై పెట్టొచ్చుకదా? " అని సీఎం జగన్మోహన్‌రెడ్డిపై దేవినేని ఉమామహేశ్వరరావు తీవ్రస్థాయిలో ఆగ్రహం వ్యక్తం చేశారు.




# సంపాదకీయం

ఆదివారం 20 మార్చి 2022

## తెలుగు నాట... ముందస్తు ముచ్చట

తెలుగునాట ఇప్పుడు ఒకటే మాట వినిపిస్తోంది. ముందస్తు ఎన్నికలు. ఏ నలుగురు రాజకీయ నాయకులు కలిసి కూర్చున్నా ఎన్నికలు ఎప్పుడు వస్తాయి. ఎవరు గెలుస్తారో. మరెవరు ఓడతారు. కేసీఆర్ తిరిగి అధికారంలోకి వస్తాడా. జగన్ కి మళ్లీ ముఖ్యమంత్రి అవుతాడా. చంద్రబాబు సంగతేంటి. పవన్ కల్యాణ్, బీజేపీలు ఏం చేస్తాయో. రేవంత్ రెడ్డి. బండి సంజయ్ లు దూకుడు ఎంత వరకు పని చేస్తుంది. కులాలు, వర్గాలు, మతాలు, ప్రాంతాలు, లెక్కలు, కూడికలు, తీసివేతలు ఉంటున్నాయి. వీటి వల్ల ఎవరికి లాభం, మరెవరికి నష్టం. అసలు ముందస్తు ఉంటుందా లేకపోతే ఒకేసారి జమిలి ఎన్నికలకు వెళతారా అనే చర్చా సాగుతోంది. గల్లీల్లోనే కాదు ఢిల్లీలోను ఇదే తీరు. ఈ నేపథ్యంలో అసలు ముందస్తు ఎన్నికలు తెలుగు రాష్ట్రాల్లో ఎన్ని సార్లు జరిగాయి. ఐదు రాష్ట్రాల ఎన్నికల తర్వాత దక్షిణాదిపైనే మా దృష్టి అన్నారు భారతీయ జనతా పార్టీ అధినేత నడ్డా. ముఖ్యంగా ఆంధ్రప్రదేశ్, తెలంగాణల్లో ఆ పార్టీ దూకుడుగా వెళుతోంది. సభలు, సమావేశాలు, వ్యూహాత్మక ఆందోళనలు, నిరసనలు, అరెస్టులతో ప్రజల్లోకి వెళ్లే ప్రయత్నం చేస్తోంది. డిసెంబర్ 22, 2021 ఢిల్లీలో జరిగిన తెలంగాణ బీజేపీ నేతల భేటీలో ముందస్తు ఎన్నికలు ఎప్పుడైనా రావొచ్చని ప్రస్తావించారు కేంద్ర హోం మంత్రి అమిత్ షా. ఎప్పుడు ఎన్నికలు వచ్చినా సిద్దంగా ఉండాలని తమ పార్టీ నేతలకు సంకేతాలిచ్చారాయన. ముందస్తు ఎన్నికలు ఉంటాయని ముందే సంకేతాలిచ్చిన తొలి వ్యక్తి ఆలంపూర్ ఎమ్మెల్యే అబ్రహాం. మార్చి5, 2022న ఆలంపూర్ లో చెప్పిన గులాబీ నేత మాటనే మిగతా పార్టీలు ప్రస్తావించడం హాట్ టాపికైంది. ముందస్తు ఎన్నికలు వస్తాయని పిసిసి చీఫ్ రేవంత్ రెడ్డి అంటే ఉత్తమ్ కుమార్ రెడ్డి లాంటి వాళ్లు కాస్తంత ముందుకెళ్లారు. కర్నాటకతో పాటే తెలంగాణ ఎన్నికలు వస్తాయని జోస్యం చెబుతున్న తీరు ఆసక్తికరమే. ముందస్తు ఎన్నికలు లేవయ్యా బాబు. ఇదేదో కావాలని ప్రచారం చేస్తున్నారంటున్నాయి వైఎస్ఆర్ కాంగ్రెస్, టీఆర్ఎస్ పార్టీలు. వాస్తవం ఏదైనా ఎవరికి వారే కార్యరంగంలోకి దూకి ప్రజల నాడి పట్టే పని చేస్తుండటం ఉత్కంఠను పెంచుతోంది.తెలుగునాట నాలుగుసార్లు ముందస్తు ఎన్నికలు జరిగాయి. ఇందులో మూడు సార్లు అధికార పార్టీకి పరాజయం ఎదురుకాగా..మరోసారి గెలిచాయి. టీడీపీ రెండు సార్లు ఓడితే.. కాంగ్రెస్ ఒకసారి అదే బాట పట్టింది. ఓటమి చరిత్రను తిరగరాసింది మాత్రం కేసీఆర్ నే.ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ లో 1983లో ముందస్తు ఎన్నికలు వచ్చాయి. 1982 మార్చి29న తెలుగుదేశం పార్టీని స్థాపించారు సినీనటుడు నందమూరి తారక రామారావు ( ఎన్టీఆర్). తెలుగుజాతి చరిత్రను తిరగరాస్తానని కాంగ్రెస్ పాలనకు అంతం పలుకుతానని శపథం చేశాడు. తన జీవితము తెలుగు ప్రజలకు, తెలుగు జాతి ఆత్మగౌరవ పునరుద్ధరణకే అంకితమని ప్రతినబూనాడు. ఇది కాంగ్రెస్ ను ఆలోచనలో పడేసింది. ఎన్టీఆర్ కు పూర్తి సమయం ఇవ్వకూడదనే ఆలోచన చేసింది అధికార కాంగ్రెస్ పార్టీ. ఫలితంగా ముందస్తు ఎన్నికలకు వెళ్లింది. మామూలుగా అయితే 1983 ఆగస్టులో జరగాలి అసెంబ్లీ ఎన్నికలు. కానీ 1983 జనవరిలోనే నిర్వహించారు. అప్పటి సీఎం కోట్ల విజయ భాస్కర్ రెడ్డి ముందస్తు వ్యూహం బెడిసికొట్టింది. ఎన్టీఆర్ జనంలోకి వెళ్లే సమయం లేదని అంచనా వేసినా 201 స్థానాలతో టీడీపీకి పట్టం కట్టారు ప్రజలు. కాంగ్రెస్ కు 60 సీట్లే వచ్చాయి. బీజేపీ-03 స్థానాల్లో సిపిఐ-04 సీట్లలో, సిపిఎం-05 సీట్లు, జనతా పార్టీ ఒక సీటులో గెలిచాయి. ఏపీలోని 42 లోక్సభ స్థానాలకుగాను 35 స్థానాలను గెలుచుకుని ప్రత్యర్థులను మట్టికరిపించింది టీడీపీ. ఆ ఆ ఏడాది దేశం మొత్తం మీద 544 లోక్సభ స్థానాలకుగాను 400 స్థానాలను గెలుచుకుంది కాంగ్రెస్. కానీ ఏపీలో మాత్రం విజయం సాధించలేకపోయింది. అప్పటి లోక్సభలో ప్రధాన ప్రతిపక్షమైంది తెలుగుదేశం పార్టీ.తెలుగుజాతి ఆత్మ గౌరవ నినాదం అధికారంలోకి వచ్చిన ఎన్టీఆర్ ముందస్తు ఎన్నికలకు వెళ్లి దెబ్బతిన్నారు. 1985లో 202 సీట్లు గెలిచిన టిడిపి ముందస్తు ఎన్నికలకు వెళ్లింది. 1990 మార్చి వరకు ప్రభుత్వానికి సమయం ఉన్నప్పటికీ నాలుగు నెలల ముందే ప్రభుత్వాన్ని రద్దు చేశారు ఎన్టీఆర్. ఆ తర్వాత తర్వాత వచ్చిన ఎన్నికలలో టీడీపీ ఘోర పరాజయం మూటగట్టుకుంది. వామపక్షాలతో పొత్తు పెట్టుకున్నా ఓటమి తప్పలేదు. 241 సీట్లల్లో పోటీ చేసి 74 స్థానాలే సంపాదించింది. సిపిఐ-08, సిపిఎం-06 సీట్లలో గెలవడం విశేషం. మరోవైపు కాంగ్రెస్ 287 స్థానాలకు పోటీ చేసి 181 సీట్లు హస్తగతం చేసుకుంది. ఫలితంగా కాంగ్రెస్ ప్రభుత్వం మరోసారి ఏపీలో అధికారంలోకి వచ్చింది. ఈ ఎన్నికల్లో బీజేపీకి ఐదు సీట్లు రావడం విశేషం.2003 అక్టోబర్ 1న అప్పటి ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ సీఎం చంద్రబాబుపై తిరుపతి సమీపంలోని అలిపిరి వద్ద నక్సల్స్ క్లైమోర్ మైన్స్ పేల్చి దాడి చేసిన సంగతి తెలిసిందే. ముఖ్యమంత్రి హోదాలో తిరుమల బ్రహ్మోత్సవాల్లో శ్రీవారికి పట్టు వస్త్రాలు సమర్పించేందుకు వెళుతుండగా చంద్రబాబుపై ఈ దాడి జరిగింది. తీవ్రగాయాలతో బయటపడ్డారు చంద్రబాబు. దేశవ్యాప్తంగా ఇది పెద్ద సంచలనమైంది. చంద్రబాబు పై సానుభూతిని తీసుకువచ్చింది. తనకు ఇది కలిసి వస్తుందని బలంగా నమ్మారు చంద్రబాబు. అందుకే 2004లో ముందస్తు ఎన్నికలకు వెళ్లింది తెలుగుదేశం పార్టీ. 2004 వరకు అసెంబ్లీ గడువు ఉన్నప్పటికీ 2003 నవంబర్ లోనే ప్రభుత్వాన్ని రద్దు చేశారు. నక్సలైట్ల దాడితో సానుభూతి వస్తుందని అంచనా వేసినా ఆ వ్యూహం పని చేయలేదు. బీజేపీతో పొత్తు పెట్టుకున్నా ప్రయోజనం లేకపోయింది. 2004 ఏప్రిల్లో జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో కాంగ్రెస్ విజయభేరి మోగించింది. ఆ ఎన్నికల్లో టీడీపీ 267 సీట్లల్లో పోటీ చేయగా?47 సీట్లు దక్కించుకుంది. మరోవైపు కాంగ్రెస్ 234 స్థానాల్లో పోటీ చేసి 185 సీట్లు దక్కించుకుంది. ఈ ఎన్నికల్లో టీడీపీ ఓట్ షేర్ 37.59 శాతం ఉంటే..కాంగ్రెస్ కు 38.56 శాతం వచ్చాయి. బీజేపీకి -02, టీఆర్ఎస్ కు-26, సిపిఐ-06 సీట్లు, సిపిఎం-09 సీట్లు, ఎస్పీ ఒకటి, జనతా పార్టీ-02, ఎంఐఎం-04, బీఎస్పీ1, స్వతంత్రులు11 సీట్లల్లో గెలిచారు. మొత్తంగా చంద్రబాబు ముందస్తు మాట కాంగ్రెస్ కు బాట అయింది.తెలంగాణ తెచ్చిన పార్టీగా గుర్తింపు తెచ్చుకున్న టీఆర్ఎస్ రెండోసారి అధికారంలోకి వచ్చే వ్యూహ రచన చేసింది. ముఖ్యమంత్రిగా ఉన్న కేసీఆర్ తెలుగురాష్ట్రాల్లో గత ముందస్తు ఓటముల చరిత్రను పట్టించుకోలేదు. ముందస్తు ఎన్నికలకు వెళ్లిన మూడు సార్లు అధికార పార్టీ పరాజయం పాలైన సంగతిని పక్కన పెట్టారు. తామే అధికారంలోకి వస్తామని బలంగా నమ్మారు. మామూలుగా అయితే 2019 ఏప్రిల్-మేలో తెలంగాణ అసెంబ్లీ ఎన్నికలు జరగాలి.

## రాయలసీమ యూనివర్సిటీ సమస్యలు పరిష్కరించాలి .....

### ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా

ఎమ్మిగనూరు పట్టణంలో రాయలసీమ యూనివర్సిటీ లో నెలకొన్న అనేక దీర్ఘకాలిక సమస్యలను మరియు అవినీతి ఆరోపణలు ఎదుర్కొంటున్న ప్రొఫెసర్, ఉద్యోగస్తులపై చర్యలు తీసుకోవాలని ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి విజేంద్ర డిమాండ్ చేశారు. జిల్లా సమితి పిలుపుమేరకు శనివారం స్థానిక సోమప్ప సర్కిల్ నందు ఏఐఎస్ఎఫ్ ఆధ్వర్యంలో ధర్నా నిర్వహించడం జరిగింది. ఈ సందర్భంగా ఏఐఎస్ఎఫ్ జిల్లా సహాయ కార్యదర్శి విజేంద్ర, తాలూకా అధ్యక్షుడు ముని స్వామి, మాట్లాడుతూ గతంలో అనేక ఆరోపణలు ఎదుర్కొని సస్పెండ్ అయి కోర్టు పరిధిలో ఉన్న అక్రమ ప్రొఫెసర్లను తీసుకోవడమే కాక వారికి ఉన్నత పదవులు ఇవ్వడం సమంజసం కాదని వారిని వెంటనే తొలగించాలని,నకిలీ సర్టిఫికేట్ల ఆరోపణలు ఎదుర్కొంటున్న వారిని తొలగించి వారిపై వేసిన టూమెన్, ఫైవ్ మెన్ కమిటీ రిపోర్ట్ లను బహిర్గతం చేయాలని,ఇంజనీరింగ్ కళాశాలలో భర్తీ చేసిన పోస్టులో రూల్ ఆఫ్ రిజర్వేషన్లు, రోస్టర్ పాయింట్లు బహిర్గతం చేయాలని, ఎగ్జామినేషన్ డిపార్ట్మెంట్ లో జరిగిన అవకతవకలపై చర్యలు తీసుకోవాలని, ఎగ్జామినేషన్ సెక్షన్ డీన్ విశ్వనాథ్ రెడ్డి అరాచకాలు అరికట్టాలని,లైబ్రరీ భవనంలో అసాంఘిక కార్యకలాపాలకు చోటివ్వకుండా వెంటనే ప్రారంభించాలని, ఇంజినీరింగ్ భవన నిర్మాణ పనులు పూర్తి చేయాలని,2007-2012 మధ్యలో కొనుగోళ్ల చెల్లింపుల్లో జరిగిన ఒక కోటి 46 లక్షల నిధుల దుర్వినియోగంలో విజిలెన్స్ నివేదిక ఆధారంగా చర్యలు తీసుకోవాలని,చిన్న తప్పులకు సస్పెండ్ చేసిన విద్యార్థులను తిరిగి తీసుకోవాలని, యూనివర్సిటీ అనేది అందరికీ సంభందించిన విషయం అని దానిని జైలు కంటే అధ్వాన్నంగా తయారుచేసి సమస్యలు పరిష్కరించాలని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన విద్యార్థులను ఇబ్బంది పెడుతున్నారని ఇది యూనివర్సిటీకి మంచి పద్ధతి కాదని వెంటనే అందరికీ అనుమతించాలని కోరారు. అదేవిధంగా యూనివర్సిటీ స్నాతకోత్సవం గత నాలుగేళ్లుగా నిర్వహించలేదని, స్నాత కోత్సవం కోసం అనేకమంది విద్యార్థులు ఎదురుచూస్తున్నారని, పిహెచ్డీ, ప్రీ పీహెచ్డీ విద్యార్థుల సమస్యలు పరిష్కరించాలని,నూతన కోర్సులు ప్రవేశ పెట్టాలని,విద్యార్థుల ఆరోగ్యం కోసం అంబులెన్స్, ఆసుపత్రి సౌకర్యం కల్పించాలని కోరారు. పై సమస్యలు పరిష్కారం కోసం కృషి చేయాలని లేకపోతే రాయలసీమ యూనివార్సిటీ ముట్టడిస్తామని వారు హెచ్చరించారు. ఈ కార్యక్రమం లో ఏఐఎస్ఎఫ్ నాయకులు దస్తగిరి,నబి, ప్రేమకుమార్,రాజు,ఉదయ్, అశోక్,వీరేష్,ధర్మ,సోమశేఖర్, విష్ణు తదితరులు పాల్గొన్నారు.

## జగన్ ఇంట నాటకం



విజయవాడ, మార్చి 19, వైయస్ జగన్ ముఖ్యమంత్రి పీఠం అధిరోహించడం.. ఆయన ఏడాది పాలన పూర్తి అయిన కొద్దిరోజులకే.. ఆయన తండ్రి దివంగత మహానేత డాక్టర్ వైయస్ రాజశేఖరరెడ్డి జయంతి సందర్భంగా ఆయన కుమార్తె వైయస్ షర్మిల.. పక్కా రాష్ట్రం తెలంగాణలో వైయస్ఆర్టీపీ స్థాపించడం.. అక్కడ అధికార టీఆర్ఎస్ పార్టీ అధినేత, సీఎం కేసీఆర్, ఆయన కుమారుడు మంత్రి కేటీఆర్ లక్ష్యంగా విమర్శనాస్త్రాలు సంధించడం.. రైతులు నిరుద్యోగులు ఆత్మహత్యల నేపథ్యంలో వారికి మద్దతుగా దీక్షలు, నిరసనలు చేపట్టడం... ఆ తర్వాత తెలంగాణలో అధికారమే లక్ష్యంగా ప్రజా ప్రస్థానం పేరుతో చేపట్టిన పాదయాత్రను తాజాగా ఆమె పునఃప్రారంభించడం..మరోవైపు వైయస్ షర్మిల భర్త.. బ్రదర్ అనిల్ కుమార్.. ఇటీవల రాజమండ్రిలో మాజీ ఎంపీ ఉండవల్లి అరుణ్ కుమార్తో భేటీ కావడం.. ఆ తర్వాత ఆ కొద్ది రోజులకే విజయవాడలో బ్రదర్ అనిల్ అధ్యక్షతన ఎస్సీ, ఎస్టీ, క్రిస్టియన్, ముస్లిం, మైనారిటీ కులాల వారిగా వారితో సమావేశం కావడం.. మళ్లీ మార్చి 14న విశాఖపట్నం వేదికగా.. ఓ హోటల్లో ఇదే కుల సంఘాలతో బ్రదర్ అనిల్ భేటీ కావడం.. అనంతరం ఆయన ప్రెస్ మీట్ పెట్టి ఆంధ్రప్రదేశ రాష్ట్రానికి బీసీ సీఎం కావాలనే డిమాండ్ ఉందంటూ కొత్త పల్లవి అందుకోవడం.. ఈ మొత్తం ఎపిసోడ్ వెనుక పెద్ద స్కెచే ఉందని తెలుగు ప్రజలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. మరోవైపు 2014 ఎన్నికల్లో ప్రతిపక్షానికి పరిమితమైన నాటి నుంచి నేటి వరకు చోటు చేసుకున్న పరిస్థితులు.. పరిణామాలు పరిశీలిస్తే... వాటి తాలుక అంశాలను ఓ సారి వరుసగా టచ్ చేస్తే... ఇదంతా ఓ పథకం ప్రకారం నడుస్తోందనే చర్చ కూడా తెలుగు నాట చాలా బలంగా వినిపిస్తోంది. వైయస్ జగన్ 16 నెలలు జైలుకు వెళ్లడం.. జగనన్న వదిలిన బాణమంటూ వైయస్ షర్మిల.. జగనన్న కోసం పాదయాత్ర చేయడం.. ఆ తర్వాత జరిగిన ఎన్నికల్లో జగన్ పార్టీ ప్రతిపక్ష పార్టీగా కొలువు తీరడం.. ఆ తర్వాత ప్రజా సంకల్ప యాత్ర పేరుతో పాదయాత్ర చేపట్టి.. ప్రజల్లోకి వెళ్లడం.. విశాఖ ఎయిర్ పోర్ట్లో కొడి కత్తి దాడి.. ఆ తర్వాత మహానేత వైయస్ఆర్ బయోపిక్ యాత్ర విడుదల కావడం.. ఈ ఎన్నికల్లో వైయస్ జగన్ పార్టీ ఘన విజయం సాధించడం.. ఆయన సీఎం కూర్చి ఎక్కడం .. ఇలా ఈ మొత్తం ఎపిసోడ్ కథ, స్క్రీన్ ప్లే, డైరెక్షన్ అంతా ఓ పకడ్బందీ పథకం ప్రకారం నడిచిందనే చర్చ కూడా తెలుగు ప్రజల్లో గట్టిగా సాగుతోంది. ఇంకోవైపు సీఎం వైయస్ జగన్తో విభేదాల కారణంగా.. వైయస్ విజయమ్మ, వైయస్ షర్మిల తెలంగాణకు వెళ్లారంటూ.. అటు మీడియాలో ఇటు సోషల్ మీడియాలో పుకార్లు షికారు చేయడం.. మరోవైపు తెలంగాణలో కంటే... ఆంధ్రప్రదేశ్లో సమస్యలు తీవ్రంగా ఉన్నాయి... వాటి వల్ల ఆ రాష్ట్ర ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారన్న సంగతి విజయమ్మకు, షర్మిలకు కూడా తెలుసు. కానీ వీటిపై వీరు కనీసం స్పందించిందీ లేదన్న సంగతి అందరికీ తెలిసిందే. పోని రాజధాని కోసం భూములు ఇచ్చిన అమరావతి రైతులు దీక్షలు, నిరసనలు చేపట్టినా. .. వారికి మద్దతుగా వీరిద్దరు ఒక పలుకు పలికిందీ కూడా లేదు. అమరావతి రైతులు దీక్ష చేపట్టిన తర్వాత.. ఆ క్రమంలో వందలాది మంది రైతులు మరణించారు. కానీ వారి కోసం వీరిద్దరు ఒక్క కన్నీటు బొట్టు కూడా రాల్చిందీ కూడా లేదన్న సంగతి అందరికి తెలిసిందే. జగనన్నకు ఒక్క చాన్స్ ఇయ్యండి.. రాజన్న రాజ్యం తీసుకు వస్తాడంటూ.. గతంలో వైయస్ విజయమ్మ, వైయస్ షర్మిల పాదయాత్ర చేసి ఢంకాభజాయించీ మరీ చెప్పారు. మరి అలాంటిది.. ఆంధ్రప్రదేశ్లో సమస్యలపై వీరు స్పందించకుండా.. పక్క రాష్ట్రం అంటూ అక్కడకు వెళ్లి వీళ్లు రాజకీయం చేయడం ఏమిటని తెలుగు ప్రజలు సంశయం వ్యక్తం చేస్తున్నారు. అంతేకాదు.. పాదయాత్ర సందర్భంగా వైయస్ జగన్ ఇచ్చిన హామీలన్నీ గాలికి కొట్టుకుపోయాయి.. ఆయన పథకాల అమలు కూడా అంతఅంత మాత్రంగానే ఉందన్న సంగతి కూడా తెలిసిందే. ఈ నేపథ్యంలో ఓ పథకం ప్రకారం.. దివంగత మహానేత వైయస్ రాజశేఖరరెడ్డి కుటుంబ సభ్యులు వైయస్ విజయమ్మ, వైయస్ జగన్, వైయస్ షర్మిల, బ్రదర్ అనిల్.. ఇలా విడిపోయినట్లు నటిస్తూ రాజకీయాలకు తెర తీశారనే చర్చ అయితే తెలుగు నాట ప్రచారంలో ఉంది.షర్మిల భర్త బ్రదర్ అనిల్ సువార్త సభలు పెడతారన్న సంగతి అందరికీ తెలిసిందే. అలాంటి ఆయన ఇటీవల విజయవాడలో కుల సంఘాలతో భేటీ తర్వాత త్వరలో మీకు శుభవార్త చెబుతానంటూ ప్రకటించడం పట్ల ప్రజలు విస్మయం వ్యక్తం చేస్తున్నారు. రానున్న ఎన్నికల్లో ఓట్లు చీల్చే కార్యక్రమాన్ని ఈ ఫ్యామిలీ భూజానికి ఎత్తుకొందని.. ఆ క్రమంలోనే ఈ తరహా ఎత్తుగడలకు తెర తీసిందనే చర్చ అమరావతిలో చాలా రంజుగా నడుస్తోంది. ఆంధ్రప్రదేశ్లో పలు పార్టీలకు బీసీల ఓట్లే కీలకం.. ఇంకా చెప్పాలంటే ఆయా పార్టీలు ఎన్నికల్లో గెలుపు ఓటములను నిర్ణయించేదీ ఈ బీసీ వర్గం తాలుకా ఓట్లే. ఈ నేపథ్యంలో బీసీల ఓట్లు చీల్చేందుకు ఓ పథకం ప్రకారం బ్రదర్ అనిల్ కొత్త కథకు తెర తీశారనే వాదన కూడా తెరపైకి వచ్చింది.

## శాసించే స్థాయి నుంచి...

విజయవాడ, మార్చి 19, (న్యూస్ పల్స్)తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబుకు పొత్తులతో ముందుకెళ్లడం అంత సులువు కాదు. గతంలో పరిస్థితి వేరు. ఇప్పుడు పరిస్థితి వేరు. చంద్రబాబు ఇప్పుడు శాసించే స్థాయి నుంచి యాచించే స్థాయికి వచ్చారు. పొత్తులను ఆయనే కోరుకుంటున్నారు. నేతల నుంచి క్యాడర్ వరకూ పొత్తులు కావాలంటుంది. ముఖ్యంగా జనసేన వంటి పార్టీలను కలుపుకుని వచ్చే ఎన్నికలకు వెళ్లాలన్నది ప్రతి తెలుగు తమ్ముడి అభిమతం. పవన్ కల్యాణ్ నిన్న చెప్పినట్లు వైసీపీ వ్యతిరేక శక్తులన్నీ ఒక కూటమిగా ఏర్పడితే ఎక్కువగా నష్టపోయేది తెలుగుదేశం పార్టీయేనన్నది వాస్తవం.సీట్లను త్యాగం .... చంద్రబాబు ఎప్పుడైనా పొత్తులతోనే విజయం సాధిస్తారు. 2019 ఎన్నికల్లో అతి విశ్వాసంతో ఒంటరిగా వెళ్లి చావు దెబ్బ తిన్నారు. ఈసారి ఆ ప్రయోగం చేయరు. అయితే ఇప్పుడు బీజేపీని పక్కన పెడితే జనసేనతో పాటు కమ్యునిస్టు పార్టీలను చంద్రబాబు కలుపుకుని వెళ్లాలన్న యోచనలో ఉన్నారు. అదే జరిగితే పెద్ద సంఖ్యలో సీట్లను త్యాగం చేయాల్సి ఉంది. నిన్న పవన్ కల్యాణ్ ప్రసంగంతో టీడీపీ అధినేత చంద్రబాబు ఫేస్ లో కొంత ఆనందం కన్పించినా, అదే సమయంలో కలవరం కూడా మొదలయిందంటున్నాయి పార్టీ వర్గాలు. ముఖ్యమైన, టీడీపీకి పట్టున్న నియోజకవర్గాలను కోల్పోవాల్సి ఉంటుంది. ప్రధానంగా తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల్లో ఈ ఎఫెక్ట్ ఎక్కువగా ఉండనుంది. ఆయన దూకుడు చూస్తుంటే అదే అర్ధమవుతుంది. ఆంధ్రప్రదేశ్ లో ఉన్నవి 175 నియోజకవర్గాలు. పవన్ కల్యాణ్ కనీసం యాభై స్థానాలను కోరుకుంటారు. కమ్యునిస్టులను కలుపుకుంటే వారికి కనీసం ఇరవై స్థానాలను కేటాయించాల్సి వస్తుంది. ఇక పొరపాటున బీజేపీ కలిసి వస్తే దానికి కూడా కనీసం ఇరవైకి పైగా అసెంబ్లీ స్థానాలను ఇవ్వాల్సి ఉంటుంది. అంటే దాదాపు 75 నియోజకవర్గాలు టీడీపీ త్యాగం చేయాల్సి వస్తుంది... గతంలో పొత్తుల విషయంలో చంద్రబాబుది పై చేయిగా ఉండేది. టీడీపీ తో పొత్తుల కోసం మిగిలిన పార్టీలు పరితపించేవి. కానీ ఇప్పుడు ఆ సీన్ లేదు. చంద్రబాబే కలసి రావాలంటూ పార్టీలను కోరుతున్నారు. జగన్ ను దించకపోతే పార్టీకి ఇక భవిష్యత్ ఉండదు. అందుకే చంద్రబాబు ఈసారి మిత్రపక్షాల సీట్ల కోరికలను మన్నించాల్సి ఉంటుంది. ఎవరిని నొప్పించినా తనకే ఇబ్బంది. అందుకే ఈసారి ఎన్నికల్లో వైసీపీకి వ్యతిరేకంగా ఏర్పడే కూటమికి చంద్రబాబు నేతృత్వం వహించినా డామినేషన్ మాత్రం మిత్రపక్షాలదేనంటున్నారు. త్యాగాలకు సిద్ధం కావాలని తమ్ముళ్లకు చంద్రబాబు త్వరలో పిలుపునిచ్చినా

## తుంబర తీర్థానికి పోటెత్తున్న భక్తులు

తిరుమల, మార్చి 19, తుంబురు తీర్థం. శేషాచలం కొండల్లోని అద్భుతం శిలా సౌందర్యం ఉట్టిపడే ప్రాంతం. గోన తీర్థంగా పిలిచే ఈ తీర్టం లో తుంబురుడు తప్పస్సు చేసిన ప్రముఖ తీర్థం. దట్టమైన అటవీప్రాంతంలో తుంబురు కోన కొండ రెండుగా చీలి దారి ఇచ్చినట్లు ప్రకృతి అందాలతో తుంబురు తీర్థం కనువిందు చేస్తోంది. ఏడాదికి ఒకరోజు మాత్రమే టీటీడీ భక్తులను తీర్థముక్కోటికి అనుమతిసస్తుండటంతో తుంబర తీర్థం భక్తులతో కిటకిట లాడిందితిరుమల వెంకటేశ్వరుడు కొలువైన శేషాచలం కొండలు ఎన్నో తీర్థాలకు నిలయం. ఎన్నో విశేషాలకు విశిష్టతలకు నిలయాలు ఏడు కొండల్లోని తీర్థాలు. తూర్పు కనుమల్లోని అంతర్భాగంగా ఉన్న శేషాచలం అడవుల్లోని తీర్థాల్లో తుంబర తీర్థానిదో ప్రత్యేకత. తిరుమలకి ఉత్తరం వైపున ఉంది. పాపవినాశనం నుంచి నాలుగు కిలోమీటర్లు కొండలు, కోనలు, రాళ్లు, రప్పలు దాటి వెళ్లాలి. తిరుమల నుంచి పాపవినాశనం వరకు బస్సుల్లో ప్రయాణం చేసేందుకు అవకాశం ఉంది. పాపవినాశనం నుంచి కొండల మధ్య నడక ప్రయాణం చేయాల్సిన భక్తులు ప్రతి ఏడాది ఫాల్గుణ మాసంలో ఉత్తర ఫల్గుణి నక్షత్రంతో కూడిన పౌర్ణమిరోజున మాత్రమే తీర్థ ముక్కోటి దర్శనానికి అనుమతి ఉంటోంది. రెండుగా చీలిన కొండ తుంబురు తీర్థానికి దారిని ఇస్తుండగా మధ్యలో ప్రవహించే జలపాతం భక్తులను పరవశింప చేస్తోంది.నారదుడు స్వామివారిపై అనర్గళంగా గీతాలు పాడడంతో తుంబురుడు వెనక్కి తగ్గి ఆ తీర్థంలోనే కూర్చుండి పోతారు. అప్పుడు వేంకటేశ్వర స్వామి అక్కడికి వెళ్లి తుంబురుడిని బుజ్జగిస్తారు. దీంతో ఆ తీర్థానికి తుంబురు తీర్థం అనే పేరు వచ్చింది.

## బాబ్జీ అంతిమయాత్రలో పాల్గొన్న మంత్రులు

గుడివాడ గుడివాడ మునిసిపల్ మాజీ వైస్ చైర్మన్ దివంగత అడపా బాబ్జి భౌతిక కాయానికి పౌరసరఫరాల శాఖ మంత్రి కొడాలి నాని, రవాణా శాఖ మంత్రి పేర్ని నాని, ఎంపీ వల్లభనేని బాలశౌరి, జడ్పీ చైర్మన్ ఉప్పాల హారిక, పామర్రు ఎమ్మెల్యే కైలే అనిల్ కుమార్ మాజీ ఎమ్మెల్యే వంగవీటి రాధ, జిల్లాలోని పలువురు ప్రజాప్రతినిధులు నివాళులర్పించారు. బాబ్జి అంతిమయాత్రలో మంత్రులు కొడాలి , పేర్ని పలువురు ప్రజాప్రతినిధులు. పాల్గొన్నారు. బాబ్జి మృతికి సంతాపంగా గురువారం పట్టణంలో వ్యాపార దుకాణాలు, వాణిజ్య సముదాయాలు మూసివేసారు ఎంపి వల్లభనేని బాలశౌరి మాట్లాడుతూ బాబ్జి ను గుడివాడ మునిసిపల్ చైర్మన్ గా చూస్తాను అనుకున్న దురదష్టవశాత్తూ ఆయన అకాల మృతి బాధాకరని అన్నారు. మంత్రి కొడాలి నాని మాట్లాడుతూ సోదరుడు,మంచి మిత్రుడిని కోల్పోయాను. గుడివాడలో ఎవ్వరితో విభేదాలు లేకుండా, పట్టణానికి సేవలు అందించిన విలక్షణ వ్యక్తి బాబ్జి. బాబ్జి కుటుంబానికి వ్యక్తిగతంగా, పార్టీ పరంగా అండగా ఉంటాం, తాను తన కుటుంబ సభ్యుడిని కోల్పోయానని అన్నారు. మంత్రి పేర్ని నాని మాట్లాడుతూ స్వార్థ చింతన లేకుండా నిస్వార్థ రాజకీయాలు చేసిన బాబ్జి గొప్ప వ్యక్తి. విలువలకు కట్టుబడే బాబ్జి లాంటి నాయకులు అరుదుగా ఉంటారు. మంచి ఆత్మీయుడిని కోల్పోయాం,కుటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలియచేస్తున్నామని అన్నారు.

## పాదయాత్రతో పొలిటికల్ హీట్

అనంతపురం, మార్చి 19, ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు నేను పాదయాత్ర చేస్తున్నా అంటూ అనంతపురం లో మాజీ ఎమ్మెల్యే ప్రభాకర్ చౌదరి చేసిన పాదయాత్ర పొలిటికల్ హీట్ పెంచింది. ప్రభాకర్ చౌదరి అనంతపురం మాజీ ఎమ్మెల్యే. రాజకీయాల్లో బాగా అనుభవం ఉన్న వ్యక్తి. 2019 ఎన్నికల్లో అర్బన్ నియోజకవర్గం నుంచి పోటీ చేసి, అనంత వెంకట్రామిరెడ్డి చేతిలో ఓడిపోయారు. ఇక అనంత వెంకట్రామిరెడ్డి స్టైల్ చాలా భిన్నం. నాలుగు సార్లు ఎంపీగా పని చేశారు. ఇప్పుడు ఎమ్మెల్యేగా ఉన్నారు. ఇప్పుడు ఈ ఇద్దరు నేతల మధ్య మాటల యుద్ధం నడుస్తోంది. వైసీపీ అధికారంలోకి వచ్చినప్పటి నుంచి నేటి వరకు ఎక్కడా ప్రభాకర్ చౌదరి మాజీ ఎమ్మెల్యే పై కామెంట్ చేయలేదు. అయితే అతని అనుచరులు మాత్రం రోజూ ఏదో ఒక విమర్శలు చేస్తూనే ఉన్నారు. దీనికి వైసీపీ నేతలు అప్పుడప్పుడు స్పందించడం షరా మామూలే. కానీ వారం రోజుల క్రితం మాజీ ఎమ్మెల్యే చౌదరి.. తాను పాదయాత్ర చేస్తానని చేసిన ప్రకటన రాజకీయంగా తీవ్ర దుమారం రేపింది.పాదయాత్రకు ముందే మాజీ ఎమ్మెల్యే పై వైసీపీ నేతలు, ప్రత్యేకించి ఎమ్మెల్యే అనంత చేసిన కామెంట్స్ రాజకీయ కాక పుట్టించింది. మొన్నటి వరకు మీరే కదా అధికారంలో ఉన్నది. ఉన్నన్ని రోజులు అప్పటి ఎంపీ జేసీ దివాకర్ రెడ్డితోనూ, అలాగే మేయర్ స్వరూపతో తగువులు పెట్టుకుని నగరానికి గాలికొదిలేశారని అనంత వెంకట్రామిరెడ్డి విమర్శించారు. అధికారంలో ఉన్నప్పుడు ఏ పనీ చేయని వారు ఇప్పుడు పాదయాత్ర చేస్తామనంటూ జనంలోకి రావడం హాస్యాస్పదంగా ఉందని రియాక్ట్ అయ్యారు. దీనికి మాజీ ఎమ్మెల్యే చౌదరి కూడా అదే స్థాయిలో స్ట్రాంగ్ ఆన్సర్ ఇచ్చారు. మీ వైఫల్యాలను ప్రజల ముందు ఉంచేందుకే తాను పాదయాత్ర చేస్తున్నానని నాలుగు రోజుల పాదయాత్ర చేశారు. ప్రజల సమస్యలు తెలుసుకుని, అధికార పార్టీ వైఫల్యాలు ఏంటో చూపిస్తానని తేల్చి చెప్పారు. అన్నట్టుగానే మాజీ ఎమ్మెల్యే నాలుగు రోజులు పాదయాత్ర చేశారు.పాదయాత్ర చేసిన నాలుగు రోజులు అధికార ప్రతిపక్ష పార్టీల మధ్య మాటల యుద్ధం కొనసాగింది. రోజూ మాజీ ఎమ్మెల్యే చౌదరి.. ప్రభుత్వంపై విమర్శలు చేయడం, వాటికి కార్పొరేటర్ నుంచి మేయర్ వరకు అందరూ కౌంటర్లు ఇవ్వడంతో పాదయాత్రకు భారీ క్రేజ్ వచ్చింది. పాదయాత్రలో కూడా టీడీపీ కార్యకర్తలు పెద్ద ఎత్తున కనిపించడంతో పార్టీలో కొత్త జోష్ వచ్చింది. అయితే ఎమ్మెల్యే పాదయాత్రపై మాత్రం సెటైర్లు బాగా వినిపించాయి. కేవలం నాలుగు రోజుల పాదయాత్రకు ఒక హైటెక్ బస్సు ఏర్పాటు చేసుకుని హైటెక్ యాత్ర చేశారంటూ వైసీపీ నేతలు ఎద్దేవా చేశారు. ప్రస్తుతం మాజీ ఎమ్మెల్యే తన పోరాటాన్ని పాదయాత్రతోనే ముగిస్తారా లేక ఇంకో రూపంలో కంటిన్యూ చేస్తారా అనేది చూడాల్సి

## ఎవరికి బెర్తులు

విజయవాడ, మార్చి 19 ముఖ్యమంత్రి జగన్ కేబినెట్ విస్తరణకు సిద్ధమయ్యారు. దాదాపు కేబినెట్ ను పూర్తిగా ప్రక్షాళన చేయాలని నిర్ణయించారు. ఒకరిద్దరు మినహా మిగిలిన అందరూ రాజీనామా చేయాల్సిందే. జగన్ ను దగ్గరగా చూసిన వారెవ్వరూ తమకు మంత్రి పదవి దక్కుతుందని ఆశించలేరు. ఆయన లెక్కలు ఎవరికీ అర్థంకావు. అనేక విషయాల్లో ఈ అంశం స్పష్టంగా తేలింది. తాను అనుకున్న వారిని కూడా రాజకీయం కోసం సులువుగా బయట ఉంచగలరు. పదవుల ఎంపికలో.... రాజ్యసభ, ఎమ్మెల్సీ పదవుల ఎంపిక చూస్తేనే జగన్ ఆలోచనధోరణి చెప్పకనే తెలుస్తుంది. ఊహించని వారికి ఎమ్మెల్సీ పదవులు లభించాయి. జగన్ విజయం కోసం కృషి చేసిన ఎంతోమంది తమకు వస్తుందని పెట్టుకున్న నమ్మకం ఎమ్మెల్సీల ఎంపిక విషయంలో వమ్మయింది. అందుకే జగన్ నవ్వు చూసి, పలకరింపు చూసి తమకు మంత్రి పదవి వస్తుందనుకుంటే అది పొరపాటే. ఈ విషయం వైసీపీ నేతలకు కూడా తెలియంది కాదు. కొందరికే ఛాన్స్... ప్రస్తుతం మంత్రివర్గంలో ఉన్న పెద్దిరెడ్డి రామచంద్రారెడ్డి, బొత్స సత్యనారాయణ, పేర్ని నాని, కొడాలి నాని కొనసాగుతారంటున్నారు. మిగిలిన వారంతా రాజీనామా చేయాల్సిందే. రాజీనామా చేసిన మంత్రులను జిల్లా కో ఆర్డినేటర్లుగా నియమిస్తామని జగన్ చెప్పారు. 26 జిల్లాలు కానుండటంతో పార్టీని మరింత బలోపేతం చేయడానికి వారి సేవలను వినియోగించుకోవాలని జగన్ ఇప్పటికే నిర్ణయించారు. దీంతో మంత్రి పదవులు ఎవరికి వస్తాయన్నది ఊహించడం కూడా కష్టమే. అయితే జిల్లాల వారీగా అనేక మంది నేతలు ఆశలు పెట్టుకున్నారు. సీనియర్ నేతల నుంచి తొలిసారి ఎమ్మెల్యేగా గెలిచిన వాళ్లు సయితం తమకు మంత్రి పదవి దక్కుతుందన్న అంచనాలో ఉన్నారు.

## ఏప్రిల్ 1 నుంచి బయోమెట్రిక్

విజయవాడ, మార్చి 19, ఏపీలోని ప్రభుత్వాస్పత్రుల్లో ఏప్రిల్ 1 నుంచి బయోమెట్రిక్ హాజరు విధానాన్ని అమలు చేయనున్నట్లు ప్రభుత్వం ప్రకటించింది. ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు (పీహెచ్సీ), సామాజిక ఆరోగ్య కేంద్రాలు (సీహెచ్సీ), ఏరియా ఆస్పత్రులు, జిల్లా ఆస్పత్రులు, బోధనాసుపత్రులన్నింటిలోనూ బయోమెట్రిక్ హాజరును ప్రవేశపెట్టింది. డాక్టర్లు, సిబ్బందికి బయోమెట్రిక్ హాజరును తప్పనిసరి చేసింది. బయోమెట్రిక్ పర్యవేక్షణ కోసం ఆస్పత్రుల్లో సీసీ కెమెరాల ఏర్పాటు చేసింది. వైద్యులు, ఇతర సిబ్బంది హాజరు శాతం తక్కువగా ఉండటంపై ప్రభుత్వం సీరియస్గా ఉంది. విధులకు వచ్చి పర్మిషన్ లేకుండా బయటికి వెళ్లిన వారి సెలవుల్లో కోత ఉంటుందని పేర్కొంది. డాక్టర్లతోపాటు సిబ్బంది డ్యూటీ సమయంలో ఆస్పత్రిలో ఉండకుండా.. సొంత పనులపై బయట తిరుగుతున్నారని ప్రజల నుంచి ఫిర్యాదులు అందుతున్నాయి.

# జే బ్రాండ్స్ తో ప్రజల ప్రాణాలు తీస్తున్నారు

**సారా నిర్మూలనలో ప్రభుత్వం విఫలం... నాసి రకం మద్యం సరఫరాలో సఫలం**

**అవి సహజ మరణాలని వాదించడం అన్యాయం**

**మృతుల కుటుంబాలకు రూ.25 లక్షలు నష్ట పరిహారం చెల్లించాలి**

**- మీడియాతో ఎమ్మెల్యే ఆదిరెడ్డి భవానీ**

రాజమహేంద్రవరం :రాష్ట్రంలో జే బ్రాండ్ల మద్యంతో జగన్ ప్రభుత్వం ప్రజల ప్రాణాలు తీస్తోందని రాజమహేంద్రవరం సిటీ ఎమ్మెల్యే ఆదిరెడ్డి భవానీ శ్రీనివాస్ ఆరోపించారు. కమిషన్ల కోసం నాసిరకం మద్యం, నాటు సారా విక్రయాలు చేస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటం ఆడుతోందని, దీంతో పేదల కుటుంబాలు రోడ్డున పడుతున్నాయని ఆవేదన వ్యక్తం చేశారు. స్థానిక తిలక్ రోడ్డులోని రాజమహేంద్రవరం సిటీ టీడీపీ కార్యాలయంలో ఎమ్మెల్యే భవానీ మీడియాతో మాట్లాడారు. ఎన్నికలకు ముందు మద్యాన్ని నిషేధిస్తానని, నాటు సారాని రూపుమాపుతానని మాయ మాటలు చెప్పిన జగన్ రెడ్డి అధికారంలోకి వచ్చాక జే బ్రాండ్ నాసిరకం మద్యం అమ్మడమే కాక, మరో వైపు నాటుసారా మాఫియాని పెంచిపోషిస్తూ ప్రజల ప్రాణాలతో చెలగాటమాడుతున్నారన్నారని ధ్వజమెత్తారు. ఒక వైపు కల్తీ మద్యాన్ని అధిక రేట్లకు అమ్ముతూ, మరో వైపు నాటు సారా మాఫియాని పెంచిపోషిస్తూ పచ్చని కుటుంబాలను నాశనం చేస్తూ, మహిళల మాంగళ్యాలు తెంచుతూ కోట్లాది రూపాయలు వెనకేసుకుంటున్నారని ఆరోపించారు. తెలుగుదేశం పార్టీ ప్రభుత్వం హయాంలో ఏపీని సారా రహిత రాష్ట్రంగా తీర్చిదిద్దితే నేడు రాష్ట్రాన్ని నాటుసారా, నాసిరకం మద్యం, గంజాయి, అసాంఘిక కార్యకలాపాలకు కేంద్రంగా మార్చారని ఆరోపించారు. రాష్ట్రంలో విచ్చలవిడిగా నాటు సారా మాఫియా చెలరేగిపోతోందన్నారు. జంగారెడ్డిగూడెంలో నాటుసారా తాగి వారం రోజుల వ్యవధిలోనే 27 మంది మృతి చెందారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయంపై సమగ్ర విచారణ జరిపించాలని, రాష్ట్రంలో నాసిరకం మద్యాన్ని, ఏరులై పారుతున్న నాటు సారాను అరికట్టాలని అసెంబ్లీలో ప్రశ్నించిన తెలుగుదేశం పార్టీ ఎమ్మెల్యేల నోరు నొక్కి సస్పెండ్ చేసి బయటకు పంపేశారని పేర్కొన్నారు. దేశంలో ఏ ముఖ్యమంత్రి అయినా రాష్ట్రానికి పరిశ్రములు, పెట్టుబడులు తెచ్చి అభివృద్ధితో సంపద సృష్టించి ప్రభుత్వ ఆదాయం పెంచుతారని, కానీ జగన్ రెడ్డి అంతా రివర్స్లో ప్రజల ప్రాణాలపై సంపాదిస్తున్నారని మండిపడ్డారు. టీడీపీ హయాంలో రూ.6 వేల కోట్లు ఉన్న మద్యం ఆదాయం వైసీపీ పాలనలో రూ.16,500 కోట్లకు పెరిగిందని, ఈ ఏడాది 20 వేల కోట్లు రాబట్టుకోవాలని టార్గెట్ పెట్టుకున్నారన్నారు. మద్యపాన నిషేధం అంటే ప్రతీ ఏటా మద్యంపై వచ్చే ఆదాయం తగ్గాలి కానీ ఎందుకు పెరుగుతుందో జగన్ రెడ్డి సమాధానం చెప్పాలని డిమాండ్ చేశారు. ప్రతి ఏటా మద్యంపై ఆదాయం పెంచుకుంటూ పోతున్నారని, మద్యంపై వచ్చే ఆదాయాన్ని చూపి రూ.25 వేల కోట్లు అప్పు తెచ్చారన్నారు. రాష్ట్రంలో గంజాయి, డ్రగ్స్ మాఫియా విచ్చలవిడిగా చెలరేగిపోతోంది. దేశంలో ఏమూలన గంజాయి పట్టుబడినా దాని మూలాలు ఏపీలో ఉంటున్నాయన్నారు. రాష్ట్రంలో నారి రకం మద్యం నివారించాలని, నాటు సారాను అరికట్టి మహిళల మాంగళ్యాలకు భద్రత కల్పించాలన్నారు. మద్యం, సారా కారణంగా మృతి చెందిన ఒక్కో కుటుంబానికి రూ.25 లక్షలు నష్ట పరిహారం చెల్లించాలని డిమాండ్ చేశారు. మీడియా సమావేశంలో తెలుగు మహిళ రాష్ట్ర ఉపాధ్యక్షురాలు ద్వారా పార్వతి సుందరి, రాజమండ్రి పార్లమెంట్ మహిళా కమిటీ అధ్యక్షురాలు మాలే విజయలక్ష్మి, రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి తురకల నిర్మల, నగర అధ్యక్షురాలు కోసూరి చండీప్రియ, మాజీ కార్పొరేటర్ సింహా నాగమణి, మహిళా నాయకురాళ్లు దొడ్ల బాల, చింతా లక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

## రెండోసారి పీకే ప్రయత్నాలు ఫలించేనా

విజయవాడ, మార్చి 19, ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ కు రానున్న ఏపీ ఎన్నికలు ఒక సవాల్ అని చెప్పాలి. ఏపీలో తిరిగి వైసీపీని ఒడ్డున పడేస్తే పీకే కు ఇక తిరుగులేనట్లే. ఎన్నికల వ్యూహకర్త ప్రశాంత్ కిషోర్ కోసం దేశంలోని అన్ని రాజకీయ పార్టీలు ఎదురు చూస్తున్నాయి. 2019లో ఆంధ్రప్రదేశ్ లో వైసీపీని, ఆ తర్వాత ఢిల్లీలో అరవింద్ కేజ్రీవాల్ ను మూడోసారి, పశ్చిమ బెంగాల్ లో మమత బెనర్జీని మూడోసారి, తమిళనాడులో స్టాలిన్ ను ఆయన గెలిపించారు. ఢిల్లీ, బెంగాల్ లో అక్కడ మూడోసారి ఆ పార్టీలను గెలిపించి ప్రశాంత్ కిషోర్ నిజంగానే దేశ రాజకీయాల్లో రికార్డు సృష్టించారు. తెలంగాణలో మూడోసారి కేసీఆర్ ను అధికారంలోకి తెచ్చేందుకు అగ్రిమెంట్ కుదుర్చుకున్నారు. ఆ ఎన్నికలు వేరు.... వరసగా మూడోసారి గెలిపించడమంటే ఆషామాషీ కాదు. అయినా పీకే విజయం సాధించారు. ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ లో ప్రశాంత్ కిషోర్ రెండోసారి జగన్ కు విజయం దక్కేలా వ్యూహాలు రచించాల్సి ఉంటుంది. 2019 ఎన్నికలు వేరు. 2024 ఎన్నికలు వేరు. అప్పుడు జగన్ ప్రతిపక్షంలో ఉన్నారు. ఇప్పుడు ఐదేళ్లు జగన్ అధికారంలో ఉన్నారు. జగన్ సంక్షేమ పథకాల్లో ముందున్నా, అభివృద్ధిలో మాత్రం వెనకబడి ఉన్నారన్నది వాస్తవం. కొంత యువతలో నైరాశ్యం కన్పిస్తుంది.మరోవైపు ఏపీ రాజకీయ పరిణామాలలో మార్పులు చోటు చేసుకుంటున్నాయి. టీడీపీ, జనసేన, కమ్యునిస్టులు కలిసి ఈసారి పోటీ చేస్తారన్న ప్రచారం ఉంది. పవన్ కల్యాణ్ సయితం వైసీపీ వ్యతిరేక ఓటు చీలకుండా ఈసారి అందరినీ ఏకం చేస్తామని చెప్పారు. ఇదే ఇప్పుడు ప్రశాంత్ కిషోర్ కు సవాల్ గా మారనుందనే చెప్పాలి. ఎందుకంటే ప్రభుత్వ వ్యతిరేక ఓటు చీల్చగలగాలి. విపక్షాలను ఏకం చేయకూడదు. ఢిల్లీ, బెంగాల్ లోనూ ఇదే తరహా వ్యూహాన్ని ప్రశాంత్ కిషోర్ రచించారు. ప్రధానంగా బలమైన కాపు సామాజికవర్గం ఓట్ల చీల్చడం తో పాటు మరో ప్రధాన సామాజికవర్గం బీసీలను వైసీపీకి మరింత చేరువ చేయాల్సి ఉంటుంది. అభ్యర్థుల ఎంపికలో కూడా ఆయనకు సర్వాధికారాలు ఉండటంతో ఆ దిశగా కూడా కొంత ప్రజలను వైసీపీ వైపు మళ్లించే ప్రయత్నం చేయవచ్చు. కానీ గత ఎన్నికలంత సులువు కాదు ఈసారి. రెండోసారి జగన్ ను, మూడోసారి కేసీఆర్ ను ప్రశాంత్ కిషోర్ అధికారంలోకి ఎలా తేగలరన్నది ఆసక్తికరంగా మారింది

## వీఏవో ఆత్మహత్యకు రాజకీయ రంగు

విజయవాడ, మార్చి 19, వీవోఏ నాగలక్ష్మి సూసైడ్ బందరులో ఉద్రిక్తతను పెంచింది. వైసీపీ నేత లైంగిక వేధింపులతోనే ఆత్మహత్య చేసుకుందంటూ బంధువులు ఆందోళనకు దిగారు.. చివరకు నిందితుడు గరికపాటి నరసింహారావును పోలీసులు అరెస్టు చేశారు.వైసీపీ నాయకుడు నరసింహారావు వేధింపులతో నాగలక్ష్మి ఆత్మహత్య చేసుకుందనే ఆరోపణలతో ఈ అంశం పొలిటికల్ టర్న్ తీసుకుంది. వైసీపీ లీడర్‌పై ఫిర్యాదు చేసినా పోలీసులు పట్టించుకోలేదంటే, ఏపీలో పరిస్థితులు ఎంత దిగజారాయో అర్థం అవుతుందన్నారు చంద్రబాబు. ప్రజలు ప్రాణాలు, బాధితుల వేదన కంటే? పోలీసులకు ప్రాధాన్యత ఏంటని ప్రశ్నించారు.నాగలక్ష్మి ఆత్మహత్యకు కారణమైన వాళ్లందరినీ శిక్షించాలని డిమాండ్ చేశారు తోటి వీఓఏ లు. అధికార పార్టీ అండ, మంత్రి భరోసా చూసుకునే.. నరసింహారావు అరాచకాలకు పాల్పడేవాడని నాగలక్ష్మి సోదరుడు తెలిపారు. పదేపదే వెంటపడి వేధించడంతోనే నాగలక్ష్మి ఆత్మహత్య చేసుకుందని అన్నారువీఏవో నాగలక్ష్మి కుటుంబ సభ్యుల ఫిర్యాదు మేరకు పోలీసులు వైసీపీ నేత గరికపాటి నరసింహారావును అరెస్టు చేసి రిమాండ్‌కు పంపారు. అయితే, వీవోఏ నాగలక్ష్మి కేసులో పోలీసుల నిర్లక్ష్యం ఏమీ లేదంటున్నారు ఉన్నతాధికారులు

## వై ఎస్ ఆర్. సి పి జిల్లా అధ్యక్షులు షేక్ అలీమ్ ను అభినందించిన ఎంపీ. విజయసాయిరెడ్డి

నెల్లూరు వైఎస్ఆర్ చారిటీ ఫర్ పీపుల్ స్వచ్ఛంద సేవా సంస్థ నెల్లూరు జిల్లా అధ్యక్షులు షేక్ .అలీమ్ ను రాజ్యసభ సభ్యులు విజయ్ సాయి రెడ్డి భుజం తట్టి అభినందించారు. తాడేపల్లిగూడెంలో ఉన్న వైకాపా కేంద్ర కార్యాలయ ప్రాంగణంలో ఎంపీ విజయసాయి రెడ్డిని లాంఛనంగా కలిశారు. ఈ సందర్భంగా ఆయనకు పూల బొకే ఇచ్చి, శాలువా కప్పి సన్మానించారు. ఈ సందర్భంగా వైయస్సార్ చారిటీ ఫర్ పీపుల్ నామకరణంతో నెల్లూరు జిల్లాలో నిర్వహిస్తున్న వివిధ సామాజిక సేవా కార్యక్రమాల గురించి ఆయనకు తెలియజేశారు. వైయస్సార్ మీద ఉన్న అభిమానంతో ఆయన పేరుమీద సేవా కార్యక్రమాలు నిర్వహించాలనే సంకల్పంతో వై ఎస్ ఆర్ సి పి ఏర్పాటు చేయడం జరిగిందన్నారు. తమ ఊపిరి ఉన్నంతవరకు వైయస్సార్ చారిటీ ఫర్ పీపుల్ స్వచ్ఛంద సేవా సంస్థ తో పేద బడుగు బలహీన వర్గాల ప్రజలకు తమ వంతు బాధ్యతగా సేవలందించడంలో రాజీపడే ప్రసక్తే లేదన్నారు. ఈ సందర్భంగా రాజ్యసభ సభ్యులు విజయ్ సాయి రెడ్డి మాట్లాడుతూ నెల్లూరు జిల్లాలో వైయస్సార్ చారిటీ ఫర్ పీపుల్ స్వచ్ఛంద సేవా సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించబడుతున్న జనరంజక సామాజిక సేవలను రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్రెడ్డి దృష్టికి తీసుకెళ్తానని హామీ ఇచ్చారు. అంతేకాకుండా వై ఎస్ ఆర్ సి పి చేస్తున్న సేవా కార్యక్రమాలకు ఎల్లవేళలా తన వంతు సహాయం అందించేందుకు సిద్ధంగా ఉన్నానని భరోసా ఇచ్చారు. ఉన్నఫలంగా ప్రస్తుతం తాను ఏ విధంగా సహాయం చేయగలనో, తన వంతు బాధ్యతగా చేసేందుకు సిద్ధంగా ఉన్నానని ఎంపీ విజయ్ సాయి రెడ్డి హక్కున చేర్చుకుని ఆదరించారు.

# పుష్ప శ్రీ వాణికి గడ్డు కాలమేనా



విజయనగరం, మార్చి 19, ఆంధ్రప్రదేశ్ డిప్యూటీ సీఎం పుష్పశ్రీవాణిపై పొలిటికల్ బాంబ్ పడబోతోందా? పుష్పశ్రీవాణి సొంత ఆడపడుచు పల్లవిరాజు టీడీపీలో చేరడంతో పాటు కురుపాం నియోజకవర్గంలో ఆమెనే ఢీకొనబోతున్నారా? అంటే.. అవుననే అంచనాలే వస్తున్నాయి.ఏపీలో తొలిసారి ఎన్నికైన 50 మంది ఎమ్మెల్యేల తీరుపై సీఎం జగన్ స్పెషల్ ఫోకస్ పెట్టారు. సీక్రెట్ సర్వే చేయించి, వచ్చిన నివేదికతో వారి పనితీరుపై అసహనం వ్యక్తం చేశారు. ఎనిమిది మంది మహిళా ఎమ్మెల్యేలపైనా తీవ్ర అసంతృప్తితో ఉన్నారు. మరో పక్కన తన కేబినెట్ లోని కొందరు మంత్రులకు ఉద్వాసన చెప్పి, కొత్త వారికి ఛాన్స్ ఇవ్వనున్నట్లు కూడా చెప్పారు. సీక్రెట్ సర్వే నివేదికలో.. లేదా ఆ ఎనిమిది మహిళా ఎమ్మెల్యేల్లో, లేదంటే మంత్రి పదవి ఊడిపోయే జాబితాలో తన పేరు ఉందేమో అనే టెన్షన్ లో డిప్యూటీ సీఎం పుష్పశ్రీవాణి ఉన్నారనే అభిప్రాయాలు వస్తున్నాయి.దీనికి తోడు పులిమీద పుట్రలా పుష్పశ్రీవాణికి ఇంటిలోనే పొలిటికల్ వార్ మొదలైంది. ఆమె ఆడపడుచు పల్లవిరాజు టీడీపీలో చేరుతున్నానని ప్రకటించడంతో పుష్పశ్రీవాణి బెర్త్ కు షాక్ తగిలే అవకాశాలున్నాయంటున్నారు. పుష్పశ్రీవాణి భర్త, అరకు పార్లమెంటరీ నియోజకవర్గం వైసీపీ అధ్యక్షుడు పరీక్షిత్ రాజుకు పల్లవిరాజు సొంత సోదరి. వైసీపీలో తనకు సరైన గుర్తింపు లేదని, మన్యం ప్రజల సమస్యలను జగన్ రెడ్డి సర్కార్ పట్టించుకోవడం లేదనేది తాను పార్టీ మారి టీడీపీలో చేరాలని నిర్ణయించుకోవడానికి కారణమని ఆమె చెబుతుండడం విశేషం. ఏజెన్సీకి సంబంధించిన ఏదైనా సమస్యపై సీఎంను కలవాలనుకుంటే జగన్ రెడ్డి కనీసం అపాయింట్ మెంట్ కూడా ఇవ్వడం లేదనే బాధతో పల్లవిరాజు రగిలిపోతున్నారు. కనీస గౌరవం కూడా ఇవ్వని వైసీపీలో తాము ఇకపై కొనసాగే పరిస్థితి లేదని, అందుకే పార్టీని వదిలేయాలని నిర్ణయించుకున్నట్లు పుష్పశ్రీవాణి మామ శత్రుచర్ల చంద్రశేఖర్ రాజు వెల్లడించడం గమనార్హం. ఇంట్లోనే డిప్యూటీ సీఎం ఉన్నా తమకు ఏమాత్రం గౌరవం దక్కడం లేదనేది ఆయన ఆరోపణ. అందుకే వైసీపీకి గుడ్ బై చెప్పేస్తున్నామని ఆయన మీడియా సమావేశంలో ప్రకటించడం గమనించదగ్గ విషయం. శత్రుచర్ల చంద్రశేఖర్ రాజు తన కొడుకు పరీక్షిత్ రాజునే కాకుండా కుమార్తె పల్లవిరాజును కూడా తన రాజకీయ వారసురాలిగా ప్రకటించడం గుర్తుంచుకోవాల్సిన అంశం.కురుపాం నియోజకవర్గం గిరిజనుల చిరకాల స్వప్నమైన లాబేసు- పూర్ణపాడు వంతెన, నాగావళి వంతెనల నిర్మాణం గురించి సీఎం జగన్ ఏమాత్రం పట్టించుకోకపోవడంతో పల్లవిరాజు, చంద్రశేఖర్ రాజు గుర్రుగా ఉన్నారంటున్నారు. వర్షాకాలంలో కురుపాం ప్రజలు పడుతున్న కష్టాలు కళ్లారా చూస్తున్నామని, ఈ వంతెనల విషయం ఎన్నిసార్లు చెప్పినా నిమ్మకు నీరెత్తినట్లు సీఎం, జగన్ పెడచెవిన పెట్టడం పల్లవిరాజు, చంద్రశేఖర్ రాజు భరించలేకపోతున్నారు.

తమ వదిన, డిప్యూటీ సీఎం పుష్పశ్రీవాణి అయినా ఈ సమస్యల గురించి పట్టించుకున్నారా అంటే అదీ లేదని పల్లవిరాజు కోపంగా ఉన్నారట. వైసీపీకి రాంరాం చెప్పేసి, టీడీపీలో చేరాలనే తమ నిర్ణయానికి పల్లవిరాజు మరికొన్ని స్థానిక కారణాలు కూడా చెబుతుండడం గమనార్హం. గిరిజన సంక్షేమ హాస్టల్ లో పాము కరిచి విద్యార్థి చనిపోతే నష్టపరిహారమైనా ప్రకటించకుండా జగన్ రెడ్డి సర్కార్ దున్నపోతు మీద నీళ్లు పడ్డ చందంగా వ్యవహరించిందని ఆమె ఆరోపిస్తున్నారు. గొప్పగా తెచ్చిన దిశ చట్టం బిల్లును పార్లమెంట్ లో పాస్ చేయించుకోలేని దుస్థితిలో వైసీపీ సర్కార్ ఉండడం సిగ్గుచేటు అంటున్నారు పల్లవిరాజు. ఇలాంటి అనేక విషయాల్లో జగన్ రెడ్డి సర్కార్ విఫలం అవడంతో తాము టీడీపీ తీర్థం తీసుకుంటున్నట్లు వెల్లడించడం విశేషం.మొత్తం మీద పల్లవిరాజు వైసీపీకి గుడ్ బై చెప్పేసి, టీడీపీలో చేరి, వచ్చే ఎన్నికల్లో కురుపాం అసెంబ్లీ స్థానం నుంచి బరిలో దిగే అవకాశాలు మెండుగా ఉన్నాయని రాజకీయ విశ్లేషకులు చెబుతున్నారు. అదే జరిగితే.. వదినా మరదళ్ల మధ్య రసవత్తరమైన రాజకీయ పోరు జరిగే చాన్స్ ఉందంటున్నారు. నిజానికి కురుపాం నియోజకవర్గం నుంచి పల్లవిరాజుకు టీడీపీ టికెట్ ఇస్తామనే హామీ ఇప్పటికే వచ్చిందనే ప్రచారం జరుగుతుండడం విశేషం. మామ చంద్రశేఖర్ రాజు, ఆడపడుచు పల్లవిరాజు టీడీపీలో చేరితే పుష్పశ్రీవాణికి రాజకీయంగా గడ్డుకాలం తప్పకపోవచ్చని పొలిటికల్ పండితులు చెబుతున్నారు.

# వై ఎస్ ఫ్యామిలీ... మూడు పార్టీలా..?

విజయవాడ, మార్చి 19, ఒకే కుటుంబంలో ఇద్దరో ముగ్గురో, రాజకీయాలలో ఉండడం సర్వ సాధారణం. అదే విధంగా వారసత్వ రాజకీయాలు మనకు కొత్త కాదు. గాంధీ నెహ్రూ ఫ్యామిలీ మొదలు కేసీఆర్ కుటుంబందాకా దేశ వ్యాప్తంగా ఎన్నో కుటుంబాలు, రాజకీయ కుటుంబాలుగా చెలామణి అవుతున్నాయి, చక్రం తిప్పుతున్నాయి. అలాగే, ఒకే కుటుంబంలోని వ్యక్తులు వేర్వేరు పార్టీలలో ఉండడం కూడా కొత్త కాదు. కానీ, ఒకే కుటుంబంలోని ముగ్గురు వ్యక్తులు మూడు, రాజకీయ కుంపట్లు రాజేయడం, ఎవరికి వారు సొంత పార్టీలు స్థాపించడం మాత్రం, బహుశా ఇదే మొదటిసారి కావచ్చును. అవును మనం ఇప్పుడు మాట్లాడుతోంది, ఎవరిగురించో కాదు, ఉమ్మడి ఆంధ్ర ప్రదేశ్ మాజీ ముఖ్యమంత్రి వైఎస్ రాజశేఖర్ రెడ్డి ఫ్యామిలీ గురించే మనం మాట్లాడుకుంటున్నాము. వైఎస్ చనిపోయిన అనంతరం ఆయన కుమారుడు జగన్ మోహన్ రెడ్డి కాంగ్రెస్ పార్టీతో విభేధించి, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీని ఏర్పాటు చేయడం, ఆ తర్వాత జరిగిన పరిణామాలు అందరికీ తెలిసినవే.వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ప్రతిపక్షంలో ఉన్నత కాలం,ఫ్యామిలీ మొత్తం ఒకటిగా ఐక్యంగానే వుంది.అంతే కాదు జగన్ రెడ్డి అక్రమాస్తుల కేసులో జైలుకు వెళ్ళిన సమయంలో 16 నెలల పాటు, జగన్ రెడ్డి తల్లి విజయమ్మ, సోదరి షర్మిల పార్టీని బతికించారు. జగన్ రెడ్డి ప్రారంభించిన పాదయాత్రను షర్మిల కొనసాగించారు. 'నేను జగనన్న వదిలిన బాణం' అంటూ దూసుకు పోయారు. పార్టీ ఆవిర్భావం నుంచి తల్లి విజయమ్మ, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గౌరవ అధ్యక్షురాలుగా కొనసాగుతున్నారు.అయితే, 2019 ఎన్నికల్లో వైసీపీ గెలిచి, జగన్ రెడ్డి ముఖ్యమంత్రి అయిన తర్వాత కుటుంబంలో కలహాలు మొదలయ్యాయి. ముఖ్యమంత్రి జగన్ రెడ్డి సోదరి షర్మిల మధ్య కలహాల కుంపటి రాజుకుంది. అలా రాజుకున్న కుంపటి ఇప్పుడు భగ్గు మంటోంది. షర్మిల, పుట్టింటి నుంచి అత్తింటికి చేరారు. తెలంగాణలో 'రాజన్న రాజ్యం' లక్ష్యంగా వైఎస్ టీపీ పేరిట సొంతంగా పార్టీని ఏర్పాటు చేశారు. షర్మిల, ఏపీలో కాకుండా తెలంగాణలో పార్టీ ఎందుకు ఏర్పాటు చేశారు, అనే విషయంలో అనేక ఊహాగానాలు వినిపించినా,అనుమానాలు వ్యక్త మయ్యాయి. అయితే జరిగిన జరుగతున్న పరిణామాలను గమిస్తే, అన్న జగన్ రెడ్డితో విబేధాలే ఆమె పార్టీ ఏర్పాటుకు మూల కారణంగా కనిపిస్తోందని, అంటున్నారు. అయితే, ఇవి కేవలం రాజకీయపదవులకు సంబదించిన విబేధాలు మాత్రమేనా లేక ఆస్తుల వివాదాలు, క్రైస్తవ సంస్థల నుంచి అందున్నవిదేశీ విరాళాల వాటాల విషయంలో తలెత్తిన వివాదాల అనే విషయంలో ఇంకా స్పష్టత రాలేదు. ఉంటే, అన్నా చెల్లికి తోడు, ఇప్పుడు బావ బ్రదర్ అనీల్ మూడో పార్టీతో ముందుకొచ్చారు. బామ్మర్ది పాలనలో క్రైస్తవులకు, బీసీ, ఎస్టీలకు తగిన ప్రాధాన్యత లేకుండా పోయిందని అంటూ, 'బీసీ' ముఖ్యమంత్రి నినాదంతో మరో పార్టీ ఏర్పాటు చేసే ప్రయత్నాల్లో ఉన్నారు. ఇందులో భాగంగా రాష్ట్రంలో పర్యటనలు చేస్తూ క్రైస్తవ పెద్దలు, క్రైస్తవ సంఘాలతో పాటు క్రైస్తవుల ప్రాధాన్యం గల ఎస్సి, ఎస్టీ, బిసి సంఘాల ప్రతినిధులతో సమావేశాలు జరుపుతున్నారు. ఇప్పటికే విజయవాడ, విశాఖపట్నంలలో సమావేశాలు జరిపారు. గత ఎన్నికల్లో తాను ఇచ్చిన పిలుపునకు స్పందించి ఎంతో మంది బీసీ, ఎస్సి, ఎస్టీ, క్రైస్తవ, ముస్లిం మైనారిటీ సంఘాల నాయకులు వైసీపీ విజయానికి కృషి చేశారని, అయినా జగన్ రెడ్డి వారిని విస్మరించారని, అనిల్ ఆరోపించారు, అంతే కాదు, అప్పుడు వాళ్ళు నా మాట విన్నారు, ఇప్పుడు నేను వారి మాట వినక తప్పదు అంటూ, రాజకీయ అరంగేట్రానికి రంగం సిద్ధం చేసుకుంటున్నారు. ఈ నేపథ్యంలో రాష్ట్రంలో బీసీ, ఎస్సి, ఎస్టీ, మైనారిటీ వర్గాలకు న్యాయం చేసేందుకు రాజకీయంగా మూడో ప్రత్యామ్నాయ శక్తిగా తయారవుదామని బ్రదర్ అనిల్‌కుమార్ పిలుపు ఇవ్వడం గమనిస్తే ఇంట్లో తలెత్తిన ఆధిపత్య పోరాటం వీధులలోకి వస్తున్నట్లు స్పష్టం అవుతున్నదని అంటున్నారు. అంతే కాకుండా, క్రైస్తవ్ మత ప్రచారకుడు బ్రదర్ అనిల్ డైరెక్ట్'గా రాజకీయ అరంగేట్రం చేయడంతో,ఇంకొన్ని కొత్త అనుమానాలు కూడా వ్యక్తమవుతున్నాయి.

## విద్యుత్ షాక్‌తో లారీ డ్రైవర్ మృతి

రాజమండ్రి మార్చి 19, విద్యుత్ షాక్‌తో లారీ డ్రైవర్ మృతి చెందిన సంఘటన కడియం మండలం కడియపులంకలో చోటు చేసుకుంది. వివరాల్లోకి వెళితే ఆ గ్రామం కాలువగట్టు(వీరవరం రోడ్డు) వద్ద ఓ నర్సరీకి ఎర్ర గ్రావెల్‌ను టిప్పర్ లారీ తీసుకువచ్చింది.గ్రావెల్ అన్‌లోడ్ చేస్తుంటే 11 కె.వి వైరు తగిలి లారీ మొత్తం విద్యుత్ ప్రవహించింది. దీంతో ధవలేశ్వరం క్వారీ కాలనీకి చెందిన దొండపాటి వీరబాబు(27) అనే డ్రైవర్ అక్కడే మృతి చెందాడు. కొద్ది నెలల క్రితమే వివాహం చేసుకున్న వీరబాబు మరికొద్ది రోజుల్లో తండ్రి కాబోతున్నాననే ఆనందంలో ఉన్నాడు.ఇంతలో విధి విద్యుత్ రూపంలో వెంటాడి మృతి చెందాడు. ఆకస్మికంగా మృతి చెందడంతో వీరబాబు బంధుమిత్రులు కన్నీరు మున్నీరుగా రోదిస్తున్నారు. ఇన్స్పెక్టర్ డి.రాంబాబు ఆధ్వర్యంలో కేసు నమోదు చేసి కడియం పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు.

# కర్నూలులో ఖిలాడీ కేడీ

కర్నూలు మార్చి 19, కర్నూలు జైలు అధికారుల నిర్లక్ష్యం పట్ల జైళ్లశాఖ తీవ్ర అసహనం వ్యక్తం చేసింది. ఐదు రోజుల వ్యవధిలో ఒకే ఖైదీ రెండుసార్లు జైలు నుంచి పారిపోవడాన్ని ఉన్నతాధికారులు తీవ్రంగా పరిగణిస్తున్నారు. ఈ ఘటనపై విచారణ చేపట్టి, సంబంధిత నివేదికను అందజేయాలని అధికారులను ఆదేశించింది. దీంతో జిల్లా ఎస్పీ సుధీర్ కుమార్ రెడ్డి అప్రమత్తమయ్యారు. జిల్లా జైలును పరిశీలించారు. పారిపోయిన ఖైదీలు ఎక్కడున్నా సరే తక్షణమే పట్టుకోవాలని ఆదేశించారు. నాలుగేళ్ల క్రితం అత్యంత పకడ్బందీగా అధునాతనంగా నిర్మించిన జిల్లా జైలు నుంచి అంత సులభంగా ఎలా తప్పించుకున్నాడనే దానిపై విచారణ ప్రారంభమైంది. ఈ నెల 12న నాని అనే ఖైదీ జిల్లా జైలు నుంచి తప్పించుకున్నాడు. వెంటనే అప్రమత్తమైన అధికారులు ఆ రోజే నానిని పట్టుకున్నారు. పారిపోయిన ఖైదీని లాకప్ లో ఉంచాలి. అతనిపై పటిష్ఠమైన నిఘా పెట్టాలి. కానీ జైలులో ఇవేమీ లేవు. పారిపోయిన ఖైదీకి సులభంగా చెట్లు ఎక్కడం, గోడలు ఎక్కి దిగే అలవాటు ఉందని జైలు అధికారులు వెల్లడించారు. ఈ ఘటనలో నలుగురు జైలు అధికారులపై చర్యలు తీసుకున్నారు. ఈ ఘటనపై ఇంకా విచారణ జరుగుతుండగానే మరో సారి అదే ఖైదీ పారిపోవడం పట్ల జైళ్లశాఖకు తలనొప్పిగా మారింది.గతంలో జిల్లా జైలు కాంపౌండ్ వాల్ దూకి అండర్ ట్రయిల్ ఖైదీ పరారయ్యాడు. ఫిబ్రవరి 16న జరిగిన హత్య కేసులో నాని అనే వ్యక్తి నిందితుడిగా జిల్లా జైలులో శిక్ష అనుభవిస్తున్నాడు. కాగా, అండర్ ట్రయల్ ఖైదీగా ఉన్న నాని శనివారం పారిపోయాడని జైలు అధికారులు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు ఒకవైపు దర్యాప్తు ప్రారంభించగానే మరోవైపు పారిపోయిన ఖైదీ తిరిగి ఉదయానికల్లా జైలులో ప్రత్యక్షమయ్యాడు. ఎలా పారిపోయాడు..? ఎందుకు తిరిగి వచ్చాడు..? అనే ప్రశ్నలకు సమాధానం దొరకాల్సి ఉంది. ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణించిన జైళ్ల శాఖ ఉన్నతాధికారులు విచారణ చేపట్టారు.

## బడ్జెట్ సమావేశాన్ని బహిష్కరించిన టీడీపీ కార్పోరేటర్లు

విజయవాడ విజయవాడ నగర పాలక సంస్థ బడ్జెట్ సమావేశం సందర్భంగా కౌన్సిల్ హాల్ కి నిరసన తెలుపుతు టీడీపీ కార్పొరేటర్లు వెళ్లిపోయారు. ఈ సందర్భంగా టీడీపీ నేత,కార్పొరేటర్ కేశినేని శ్వేత మీడియా తో మాట్లాడుతూ విజయవాడ నగర పాలక సంస్థ మున్సిపల్ చట్టానికి వ్యతిరేకంగా బడ్జెట్ను ప్రవేశపెట్టిన వైసీపీ పాలకపక్షం. బడ్జెట్ నగర ప్రజలకు గుదిబండగా మారబోతుందని అన్నారు. గత మూడు సంవత్సరాలు నుండి నగరంలో వైసిపి చేసిన అభివృద్ధి శూన్యం. గత సంవత్సర కాలం నుండి ఉన్న వైసిపి పాలకపక్షం రాష్ట్ర ప్రభుత్వం నుండి కేంద్ర ప్రభుత్వం నుండి నిధులు తీసుకురావడంలో పూర్తిగా విఫలమైంది. విజయవాడ నగరంలో స్థానిక మంత్రి ఉండి కూడా నగరం అభివృద్ధికి నోచుకోకపోవడం సిగ్గుచేటు. నగరంలో రోడ్లు కన్నా రోడ్లు పైన గుంటలు ఎక్కువగా ఉన్నాయని అన్నారు. గత సంవత్సర కాలం నుండి వైసిపి పాలకపక్షం నగర అభివృద్ధి కోసం ముఖ్యమంత్రిని కలిసి నిధులు తీసుకువచ్చే తీరిక లేకుండా ఉన్నారు నగరంలో చెత్త పన్ను ఒక దరిద్రం అనుకుంటే వసూలు చేస్తున్న విధానం మరింత వింతగా ఉంది. రానున్న రోజుల్లో వైసిపి పాలకపక్షం ఓ కొత్త పథకం తీసుకు రాబోతుంది పన్ను కట్టకపోతే ఇల్లు జప్తు చేసి మున్సిపల్ వాహనాల్లో సామాన్లు పట్టుకుపోతారంట. ప్రజలకు సంక్షేమ పథకాలు ఇవ్వలేక వైసీపీ ప్రభుత్వం ప్రతి సంవత్సరం లబ్ధిదారులను తగ్గిస్తున్నారు. భవిష్యత్లో నగరంలో మీ నాయకులు నిర్వహించే గడప గడపకు వైసీపీ కార్యక్రమంలో ప్రజలు తగిన బుద్ధి చెప్పుటకు సిద్ధంగా ఉన్నారని అన్నారు.

# గంటా స్కెచ్ లెక్కలేంటీ

విశాఖపట్టణం, మార్చి 19,నసేన అధినేత పవన్ కల్యాణ్ వైసీపీకి వ్యతిరేకంగా తాను అన్ని పార్టీలను ఏకం చేస్తానని చెప్పారు. వ్యతిరేక ఓట్లు చీలకుండా బాధ్యతను తానే తీసుకుంటామని చెప్పారు. అయితే ఇది ఇప్పుడు కొత్త చర్చకు దారి తీసింది. పవన్ కల్యాణ్ కామెంట్స్ వెనక గంటా శ్రీనివాసరావు ఉన్నట్లు ప్రచారం జరుగుతుంది. పవన్ ను ముఖ్యమంత్రిని చేయాలని, కాపులకు రాజ్యాధికారం రావాలన్న దిశగా గంటా ఇప్పటికే ప్రయత్నాలు మొదలు పెట్టారు. వరస సమావేశాలతో.... కాపు సామాజికవర్గం నేతలు, మేధావులతో గంటా శ్రీనివాసరావు వరస సమావేశాలు నిర్వహిస్తున్నారు. ఆంధ్రప్రదేశ్ లో కాపు సామాజికవర్గం ఓట్లు ఎక్కువగా ఉన్నా ముఖ్యమంత్రి పదవి దక్కడం లేదన్నది అందరి అభిప్రాయం. తమ సామాజికవర్గం అన్ని రంగాల్లో అభివృద్ధి చెందాలంటే కాపులు ప్రత్యేకత ఈ ఎన్నికల్లో చూపాలన్నది సమావేశంలో అందరు ఏకాభిప్రాయంతో అంగీకరించారు.మంత్రి పదవులతోనే... అన్ని పార్టీల్లో కాపు నేతలున్నా, వారికి మంత్రి పదవులతో సరిపెడుతున్నారని, ఈ వైఖరిని మార్చాలంటే మనమే ఆల్టర్నేటివ్ గా మారాలని కాపు సామాజికవర్గంలో బలమైన నేతను ముందుంచాలని ఎక్కువ మంది అభిప్రాయపడుతున్నారు. వారికి పవన్ కల్యాణ్ బలమైనే నేతగా కన్పించారు. ఇప్పటికే పార్టీని స్థాపించిన పవన్ కల్యాణ్ ను ఈసారి ముఖ్యమంత్రి పదవిలో కూర్చోబెట్టాలన్నది కాపు సామాజికవర్గం పెద్దల ఆలోచనగా చెబుతున్నారు వచ్చే ఎన్నికల్లో తమ మద్దతు కావాలంటే కాపులకే ముఖ్యమంత్రి పదవి ఇస్తామన్న పార్టీకే మద్దతు ఇవ్వాలని నిర్ణయించారు. అందులో భాగంగానే పవన్ కల్యాణ్ కూటమి ఏర్పాటు ప్రకటన చేశారంటున్నారు. గంటా శ్రీనివాసరావు కూడా జనసేనలో చేరే అవకాశాలు ఉన్నాయి. ఆయన ప్రస్తుతం టీడీపీలో ఉన్నా పార్టీ కార్యక్రమాలకు దూరంగా ఉంటున్నారు. స్పీకర్ ఆమోదం పొందక పోయినా ఆయన ఎమ్మెల్యే పదవికి రాజీనామా లైవ్ లోనే ఉంది. ఆయన అసెంబ్లీ సమావేశాలకు కూడా హాజరు కావడం లేదు. కాపు సామాజికవర్గం నుంచి వచ్చిన సూచనలు, సలహా మేరకు పవన్ కల్యాణ్ ఆవిర్భావ సభలో ఈ ప్రకటన చేశారన్న ప్రచారం అయితే బాగానే వినపడుతుంది.



# మహిళలు జె బ్రాండ్ వ్యతిరేకంగా పోరాటం చేయాలి ::ఏ.వి.సుబ్బారెడ్డి



నంద్యాల, మార్చి 19 ( విభారె) , :- .నంద్యాల పట్టణంలో శనివారం నాడు ఓ ప్రకటనలో విత్తనాభివృద్ధి సంస్థ మాజీ చైర్మన్ ఎవి సుబ్బారెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర వ్యాప్తంగా కల్తీ నాటుసారా , జె బ్రాండ్ మద్యం పేద మహిళల తాళిబొట్లు తెంచేవిదంగ వైసీపీ ప్రభుత్వం పేదలపై పగ పట్టిందని రాష్ట్ర విత్తనాభివృద్ధి సంస్ద మాజీ చైర్మన్, సీనియర్ టిడిపి నాయకుడు ఏవీ సుబ్బారెడ్డి విమర్శించారు . వైసీపీ ప్రభుత్వం కాసుల కక్కుర్తితో నకిలీ మద్యాన్ని విక్రయిస్తూ పేదల ప్రాణాన్ని బలి పెట్టి తమ జె బ్రాండ్ సొమ్ముతో జేబులు నింపు కొంటున్నారు . రాష్ట్రంలో వైసీపీ నాయకులకు, కార్యకర్తలకు నాటు సారా తయారీ కేంద్రాలు ఆదాయ వనరుగా మారిందని పేర్కొన్నారు . రాష్ట్రంలో తాగడానికి నీళ్లు లేక పోయినా నాటు సారాయి , నకిలీ మద్యం విచ్చలవిడిగా లభిస్తున్నదని దీనితో పేద ,మధ్యతరగతి కుటుంబాలు చిన్నాభిన్నం అవుతున్నట్లు ఆవేదన వ్యక్తం చేశారు . వైసిపి నాయకులు తమ సొంత బ్రాండ్ లతో తమజోబులు నింపుకోవడానికి దేశంలో ఎక్కడా లేని విధంగా విక్రయించి పేద ప్రజల ప్రాణాలను బలి తీసుకుంటున్నారని అన్నారు. సంవత్సరానికి ఐదు వేల కోట్లు పైగా సంపాదించడానికి మహిళల తాళిబొట్టు లను మట్టిలో కల్పేస్తున్నారని విమర్శించారు. రాష్ట్రవ్యాప్తంగా గ్రామాల నుంచి పట్టణాల వరకు విచ్చలవిడిగా నాటు సారాయి తయారీ కేంద్రాలు ఏర్పాటు చేసుకొని సొమ్ము చేసుకుంటున్నారని పేర్కొన్నారు. జంగారెడ్డిగూడెంలో కల్తీనాటు సారా తాగి 25 మంది మృతి చెందడం దారుణమని, రాష్ట్రవ్యాప్తంగా మహిళలు తమ తాళిబొట్టు లను కాపాడుకోవడానికి ప్రభుత్వంపై ఒక దుర్గామాతగా విజృంభించి పోరాటాలు చేయాలని తెలిపారు. ఇప్పటికే రాష్ట్రవ్యాప్తంగా కల్తీ నాటు సారాయి నకిలీ జె బ్రాండ్లతో లక్షలాది మంది మద్యం ప్రియులు ఆరోగ్యాలు దెబ్బతిని మంచాన పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. మహిళలు జే బ్రాండ్ కు వ్యతిరేకంగా పోరాటం చేయాలని పిలుపునిచ్చారు.

## యూటీఏఫ్ నాయకులు సుబ్బారెడ్డి సేవలు మరువలేనివి

డోన్ మార్చి 19 ( విభారె) :యూటీయఫ్ నాయకుడు సుబ్బారెడ్డి ఉఫాధ్యాయులకు చేసిన సేవలు మరవలేనివి అని డోన్ యం ఈ ఓ ప్రభాకర్ అన్నారు, స్ధానిక పాతపేట లోని జడ్పీ ఉన్నత పాఠశాలలో ఉఫాధ్యాయుల సమావేశంలో ప్రధానోపాధ్యాయులు పద్మావతమ్మ అధ్యక్షతన, మండల విద్యాశాఖాధికారి ప్రభాకర్ ముఖ్య అతిథిగా జరిగిన కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు వెంకట సుబ్బారెడ్డి యూటీఎఫ్ రాష్ట్ర ఆడిట్ కమిటీ సభ్యులుగా ఎన్నిక కావడం పట్ల హర్షం వ్యక్తంచేశారు,ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఈరోజుటికీ డోన్ మండల ఉపాధ్యాయులకే కాకుండా, డోన్ డివిజన్ లో పనిచేసే ఉపాధ్యాయులకు కూడా సుబ్బారెడ్డి గారు సేవలు అందిస్తున్నారన్నారు, గత 30 సంవత్సరాల నుండి సుబ్బారెడ్డి గారు ఎక్కడ పనిచేసినా ఆ పాఠశాలలో ఎలాంటి సమస్యలు లేకుండా చూడడమే కాకుండా, ఆ మండలం లోని ఉపాధ్యాయులకు కూడా డోన్ డివిజన్ లోని ఉపాధ్యాయులకు కూడా సేవలు అందిస్తున్నారన్నారు, ఇన్కంటాక్స్ సర్వీస్ తో పాటు లీవ్స్, ఇంక్రిమెంట్లు, అడ్వాన్స్ మెంట్ ఇంక్రిమెంట్లు, తదితర విషయాలను గురించి అందరికీ అవగాహన కల్పించే ఉపాధ్యాయుడుగా వారిని కొనియాడారు,పాఠశాల ఉపాధ్యాయులతో కలిసి సుబ్బారెడ్డి కి శాలువా కప్పి పూలమాలతో అభినందనలు తెలియ చేశారు,ఈ కార్యక్రమంలో సీనియర్ ఉపాధ్యాయులు శివ ప్రసాద్, వెంకటేశ్వర్ గౌడ్, వెంకట రమణ, లక్ష్మయ్య, చంద్రశేఖర్ గౌడ్, రాధ, అల్లిపీరా, అనంత శ్రీనివాసులు, భూకాంతరెడ్డి, టి.శ్రీనివాసులు, భారతి బాయి,మద్దిలేటి, ఆదినారాయణ, సురేష్, లీలావతమ్మ, మధు సూదన్ రెడ్డి, సంజీవరెడ్డి, రమేష్, సుబ్బారాయుడు, లక్ష్మి కాంతరెడ్డి, జయ సుబ్బారాయుడు, సుభాన్, రవిశేఖర్, వెంకట లక్ష్మి, యు.శ్రీనివాసులు, దేవేంద్రప్ప, నూర్జహాన్, ఆదినారాయణ, రాఘవేంద్ర, భాను ప్రకాష్ రెడ్డి, వై.శ్రీనివాసులు, శివన్న, లక్ష్మి ప్రభావతి, ముని రాజు,ప్రసాద్ రావు, మహేష్, అల్లిపీరా,తదితరులు పాల్గొన్నారు.

# జగన్మోహన్ రెడ్డి దిగిపోవాలి




కౌతాళం మార్చి 19 ( విభారె) ,: కల్తీ మద్యం తో ప్రజలు ప్రాణలుతో ఆడుకుంటున్న వైయస్సార్ ప్రభుత్వం దిగి పోవాలని మంత్రాలయం నియోజకవర్గం తెలుగు దేశం పార్టీ ఇన్ చార్జ్ పాలకుర్తి తిక్కరెడ్డి గారు సోదరుడు టిడిపి రాష్ట్ర కార్యదర్శి పాలకుర్తి శ్రీనివాస్ రెడ్డి గారు అన్నారు వారు మంత్రాలయం నియోజకవర్గం లోని కౌతాళం మండలం లో తెలుగు

### ప్రజలు ప్రాణలుతో ఆడుకుంటున్న వైయస్సార్ ప్రభుత్వం

### తెదేపా రాష్ట్ర కార్యదర్శి పాలకుర్తి శ్రీనివాస్ రెడ్డి

దేశం పార్టీ పిలుపు మేరకు కౌతాళం లో స్థానిక తెలుగు దేశం పార్టీ ఆఫీసు నుండి డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ సర్కిల్ వరకు ర్యాలీ గా వెళ్లి జే-బ్రాండ్స పోవాలి అంటే జగన్ మోహన్ రెడ్డి దిగి పోవాలి అని పెద్దఎత్తున ధర్నా నిర్వహించారు ఈ కార్యక్రమంలో తెదేపా రాష్ట్ర కార్యదర్శి పాలకుర్తి శ్రీనివాస్ రెడ్డి గారు మాట్లాడుతూ వైయస్సార్ ప్రభుత్వం కల్తీ మద్యం తో ప్రజలు ప్రాణలు తిస్తూంది అని జంగారెడ్డిగూడెం లో కల్తీ సారా తాగి 20 మంది చనిపోతే కనీసం ప్రభుత్వానికి చీమ కుట్టినట్టు కూడా లేదు అని జగన్ మోహన్ రెడ్డి పాదయాత్ర లో మద్యం నిషేధం అని చెప్పి ఇపుడు కల్తీ సారాయి చేయడం ఏమిటి అని ప్రశ్నించారు జంగారెడ్డిగూడెం బాధితులకు 25 లక్షలు పరిహారం అందజేయాలని డిమాండ్ చేస్తూ బారి ఎత్తుగా నిరసన వ్యక్తం చేశారు. అధికారంలోకి వస్తే మద్య నిషేధం అమలు చేస్తామని చెప్పి ఇపుడు కల్తీ సారాతో నాణ్యత లేని సొంత బ్రాండ్ల్ తో మహిళలు తాళిబొట్లు తెంచుతున్నారని రాష్ట్రంలో నాటు,కల్తీ సారా ఏరులై పారుతున్న ప్రభుత్వం అరికట్టడం లేదు అని వారు అన్నారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం రాష్ట్ర కార్యదర్శి అడివప్ప గౌడ్, టిడిపి జిల్లా ఉపాధ్యక్షులు చెన్నబసప్ప , రైతు సంఘం జిల్లా ప్రదాన కార్యదర్శి వెంకటపతి రాజు,తెలుగు యువత నియోజకవర్గం అధ్యక్షులు బాపురం సుధీర్ రెడ్డి, నీలకంఠ రెడ్డి, మైనార్టీ అధ్యక్షులు టిపు సుల్తాన్, జిల్లా కార్యదర్శి అబ్దుల్ రహ్మాన్, డాక్టర్ రాజానంద్, వెంకటరెడ్డి, బుదుదోడ్డి,దోడ్డన్న గౌడ్, కాత్రికి మాజీ సర్పంచ్ చంద్ర,ఈడిగ ఈరన్న, తిపులదోడ్డి సర్పంచ్ మల్లయ్య, ఏరిగేరి బసవరాజు,మాబుసాబ్, నరసింహులు, ఒబుళపురం నరసింహులు,చిర్తపల్లి ఆళ్ళయ్య, యస్ సి సెల్ నాయకులు రాజాబాబు,సునీల్, ఏరిగేరి ఈరన్న, డేవిడ్,ఐ టిడిపి బృందం సల్మాన్ రాజు, మంజునాత్ దేని, ఉసేని, విరేష్, క్రిష్ణ, చిదానంద, , తెలుగు యువత నీలమ్ రెడ్డి, సిద్దు, పులిగోట్టయ్య, శ్రీరాములు, ఉమేష్, ఏరిగేరి శ్రీరాములు,తదితరులు పాల్గొన్నారు.

# నాగార్జున జూనియర్ కళాశాల పై ఫిర్యాదు చేస్తాము :: ఏఐఎస్ఎఫ్



నంద్యాల మార్చి 19 ( విభారె) :- ప్రభుత్వ అనుమతులు లేకుండా కాలేజి లొనే మహిళ విద్యార్థుల హాస్టల్ నిర్వహిస్తున్న నాగార్జున జూనియర్ కళాశాలను సీజ్ చేయాలని డిమాండ్ చేశారు . ఫైర్ సర్టిఫికెట్ లేకుండా 5 అంతస్తుల్లో కళాశాల నిర్వహిస్తున్న నాగార్జున జూనియర్ కళాశాల యాజమాన్యంపై క్రిమినల్ కేసులు నమోదు చేయాలని వారు డిమాండ్ చేశారు. ఎఐయస్ ఫ్. జిల్లా అధ్యక్షుడు ధనుంజయుడు, జిల్లా ఉపాధ్యక్షుడు సురేష్. ఈ సందర్భంగా స్టానిక నంద్యాల సీపీఐ కార్యాలయంలో జరిగిన ముఖ్య నాయకుల సమావేశంలో ఏఐయస్ ఫ్.జి ల్లా అధ్యక్షుడు ధనుంజయుడు మాట్లాడుతూ నంద్యాల పట్టణంలోని పద్మావతి నగర్లో ఉ న్న నాగార్జున జూనియర్ కళాశాల యాజమాన్యం ఎటువంటి ప్రభుత్వ నిబంధనలు పాటించకుండా కమర్షియల్ బిల్డింగ్ లో కళాశాల నిర్వహిస్తూ,5 అంతస్తుల బిల్డింగ్ లో కళాశాల నిర్వహిస్తూ ఫైర్ సర్టిఫికెట్ లేకుండా కళాశాల లొనే హాస్టల్ నడపడం వల్ల విద్యార్థులకు ప్రమాదాలు జరిగే అవకాశాలున్న ఏ మాత్రం ఆలోచన లేకుండా కళాశాల నిర్వహిస్తున్నప్పటికి ఫైర్ సేఫ్టీ అధికారులు నిశబ్ధంగా ఉండడమెంటని వారు ప్రశ్నించారు. అంతే కాకుండా పరీక్షల సమయంలో కూడా ప్రభుత్వ నిర్ణయించిన పరీక్ష ఫీజు కన్నా ఎక్కువ మొత్తంలో విద్యార్థుల నుండి ఫీజులు వసూలు చేస్తున్నారని,ప్రాక్టీకల్స్ కు ఎటువంటి ఫీజు లేనప్పటికీ ప్రాక్టీకల్స్ కు కూడా ఫీజులు వసూలు చేస్తూ నాగార్జున జూనియర్ కళాశాల యాజమాన్యం విద్యార్థులను

విద్యార్థుల తల్లిదండ్రులను మోసం చేస్తున్న కూడా విద్యాశాఖ అధికారులు ఎందుకు స్పందించడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారు.కావున తక్షణమే ప్రభుత్వ నిబంధలకు విరుద్ధంగా కళాశాల నిర్వహిస్తూ,ఫైర్ లేకుండా కళాశాల నిర్వహణ చేస్తూ,పరీక్షల పేరుతో అధిక ఫీజులు వసూలు చేస్తున్న నాగార్జున జూనియర్ కళాశాలపై చర్యలు తీసుకోవాలని లేని పక్షంలో ఇంటర్మీడియట్ అర్ జే డి గారికి,విద్యాశాఖ కమిషనర్ గారికి,ఇంటర్మీడియట్ బోర్డ్ కమిషనర్ గారికి కూడా నాగార్జున జూనియర్ కళాశాల దోపిడిపై,అనుమతులు లేకుండా చేసున్న హాస్టల్ నిర్వహణపై పిర్యాదు చేస్తామని వారు హెచ్చరించారు.ఈ కార్యక్రమంలో ఏఐయఎస్ ఫ్ . నంద్యాల పట్టణ నాయకులు మనోహర్,లోకేష్,సంతోష్,వెంకట్, అంజి తదితరులు పాల్గొన్నారు

# బద్వేల్ లో పెద్ద పులి సంచారం

బద్వేలు, మార్చి 19 ( విభారె) బద్వేలు పట్టణానికి కేవలం ఐదారు కిలోమీటర్ల దూరంలో ఉన్న నెల్లూరు రోడ్డు జాతీయ రహదారిపై పెద్దపులి సంచారం చేస్తూ ఉండడం భయాందోళనకు గురిచేస్తుంది శుక్రవారం రాత్రి 10:30 11 గంటల ప్రాంతంలో పెద్దపులి జాతీయ రహదారి దాటుతూ కంట పడింది సుదర్శన ఆశ్రమం సమీపంలో ఈ పెద్ద పులి రోడ్డు రోడ్డు దాటి దాటుతుండగా వాహనదారులు గమనించారు పెద్దపులి రోడ్డు దాటిన తర్వాత వాహనాలు ముందుకు కదిలాయి గతంలో ఇలాంటి సంఘటన ఎప్పుడూ జరగలేదని స్థానికులు చెబుతున్నారు పెద్ద పులి సంచారం ఒక విధంగా భయాందోళనకు గురిచేస్తుంది ఈ విషయంలో అటవీశాఖ అధికారులు చర్యలు తీసుకోవాల్సి ఉంది

# 'సలార్' లో ప్రభాస్ మ్యాన్లీ లుక్ అంత వీజీనా?



డార్లింగ్ ప్రభాస్ కటౌట్ గురించి చెప్పాల్సిన పనిలేదు. అతని హైట్..వెయిట్ అన్నది 'బాహుబలి' లాంటి వార్ చిత్రాలకు..కమర్శియల్ యాక్షన్ చిత్రాలకు పక్కాగా యాప్ట్ అవుతుంది. ఇంకా చెప్పాలంటే ప్రబాస్ ని కొట్టే కటౌట్ రానాకి తప్ప టాలీవుడ్ లో ఇంకేహీరోకి లేదని చెప్పాలి. ప్రభాస్ రేంజ్ కటౌట్ మళ్లీ బాలీవుడ్ లో హృతిక్ రోషన్ మాత్రమే. అలాంటి కటౌట్ పాత్రల్లో ట్రాన్సఫర్మేషన్ కోసం ఎలాంటి ఇబ్బందులు పడుతున్నారో తెలిసిందే.'సాహో' లాంటి యాక్షన్ సినిమాలో ప్రభాస్ కటౌట్ సరిగ్గా హైలైట్ కాలేదని విమర్శ ఉంది. అతని మేకోవర్ సరిగ్గా కుదరలేదని ఫీడ్ బ్యాక్ అప్పుడే వచ్చింది. ఇటీవలే ప్రభాస్ పిరియాడిక్ లవ్ స్టోరీ 'రాధేశ్యామ్' లో ఎలా కనిపించారో తెలిసిందే.ప్రభాస్ లాంటి భారీ దేహంతో అందమైన లవ్ స్టోరీ చేయాలని ట్రై చేసారు. తప్పు లేదు. కానీ ప్రభాస్ ని ఆ లవ్ స్టోరీ లో ప్రేక్షకులకు ఓన్ చేసుకోలేకపోయారు. ముఖంలో మార్పులు.. లుక్ పరంగా రొమాంటిక్ లవ్ స్టోరీ అతను సెట్ కాలేదనే విమర్శ తెరపైకి వచ్చింది. యాక్షన్ హీరోతో లవ్ స్టోరీ ఏంటి? అన్న వాదన వినిపించింది.ఈ విషయంలో ప్రభాస్ తప్పిదాలు కూడా హైలైట్ అయ్యాయి. ప్రభాస్ వ్యక్తిగత జాగ్రత్తలు తీసుకోవడం అశ్రద్ద చేసారని ఆ కారణంగా లుక్ పరంగా పెద్దగా మార్పులు కనిపించలేదని అన్నారు. ఆ సంగతి పక్కనబెడితే ఇప్పుడు ఇదే రకమైన టెన్షన్ యాక్షన్ మేకర్ ప్రశాంత్ నీల్ ని టెన్షన్ పెడుతున్నట్లు కనిపిస్తోంది. ప్రభాస్ తో ప్రశాంత్ నీల్ 'సలార్' అనే భారీ యాక్షన్ ఎంటర్ టైనర్ ని తెరకెక్కిస్తోన్న సంగతి తెలిసిందే. ఇదే సమయంలో డార్లింగ్ బాలీవుడ్ లో 'ఆదిపురుష్' లో నటిస్తున్నాడు.ఇందులో ప్రభాస్ రాముడి పాత్రలో నటిస్తున్నాడు. రాముడి పాత్రలో అందంగా..సున్నితంగా కనిపించడం కోసం లుక్ పరంగా ఎన్నో జాగ్రత్తలు తీసుకున్నారు. అదే సమయంలో 'సలార్' లో యాక్షన్ హీరోగా మాసీలుక్ కనిపించాలి. ఈ రెండు పాత్రల మధ్య ట్రాన్సపర్మేషన్ అంత వీజీ కాదు. రెండింటిలోనూ లుక్ పరంగా చాలా ఛేంజ్ చూపించాలి. మరి ఇప్పటివరకూ 'సలార్' లుక్ బయటకు రాలేదు కాబట్టి ప్రభాస్ ఎలా కనిపిస్తాడు? అన్నది తర్వాత ఆలోచిద్దాం.కానీ 'ఆదిపురుష్' షూటింగ్ పూర్తయింది కాబట్టి ప్రభాస్ ని - ప్రశాంత్ నీల్ మ్యాన్లీగా మార్చాలి. పూర్తిగా టైటిల్ కి తగ్గట్టు..స్క్రిప్ట్ కి తగ్గట్టు లుక్ ని మార్చాల్సి ఉంది. ఈ విషయంలో అభిమానుల్లో కాస్త ఆందోళన తెరపైకి వస్తోంది. 'సలార్' లీక్డ్ ఫిక్స్ తో ఇప్పటికే అభిమానుల్ని జీర్ణించుకోలేకపోతున్నారు. లుక్ పరంగా ప్రభాస్ ని ఇంకా రఫ్ గా..మాస్ లుక్ లో ఎలివేట్ చేయాలని అభిప్రాయాలు తెరపైకి వస్తున్నాయి.

# స్పీడు పెంచేస్తూ షాకిస్తున్న ఎన్టీఆర్!

దర్శకధీరుడు రాజమౌళి తెరకెక్కించిన భారీ మల్టీస్టారర్ 'ఆర్ ఆర్ ఆర్' ఫైనల్ గా మార్చి 25న వరల్డ్ వైడ్ గా విడుదల కాబోతున్న విషయం తెలిసిందే. ఈ మూవీ కోసం మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ యంగ్ టైగర్ ఎన్టీఆర్ దాదాపు మూడేళ్లు శ్రమించారు. వీరి శ్రమ త్వరలో ఫలించబోతోంది. వెండితెరపై 'ఆర్ ఆర్ ఆర్'తో ఈ ఇద్దరు హీరోలు అద్భుతం సృష్టించబోతున్నారు. ఇప్పటికే ప్రీమియర్ షోస్ పరంగా ఈమూవీ అన్ బిలీవబుల్ రికార్డ్స్ ని క్రియేట్ చేసి సంచలనం సృష్టిస్తోంది. మూడేళ్లు శ్రమించిన మూవీ రిలీజ్ అవుతున్న వేళ హీరో రామ్ చరణ్ తన తదుపరి చిత్రాలని పట్టాలెక్కించడం మొదలు పెట్టారు.శంకర్ డైరెక్షన్ లో భారీ పొలిటికల్ యాక్షన్ థ్రిల్లర్ ని చేస్తున్న చరణ్ ఈ చిత్ర షూటింగ్ ని ఇప్పటికే ప్రారంభించారు. కీలక ఘట్టాల చిత్రీకరణ



ఇటీవల రాజమండ్రి పరిసర ప్రాంతాల్లో పూర్తి చేసుకుంది. పిరియాడిక్ నేపథ్యంలో సాగే పొలిటికల్ డ్రామాగా ఈ మూవీని శంకర్ తెరకెక్కిస్తున్నారు. ఈ మూవీతో పాటు త్వరలో 'జెర్సీ' ఫేమ్ గౌతమ్ తిన్ననూరి డైరెక్షన్ లో చరణ్ ఓ భారీ చిత్రాన్ని చేయబోతున్న విషయం తెలిసిందే. ఈ మూవీ రెగ్యులర్ షూటింగ్ జూన్ నుంచి ప్రారంభం కానుందని వార్తలు వినిపిస్తున్నాయి.'ఆర్ ఆర్ ఆర్' తరువాత ఒక మూవీని ప్రారంభించి చరణ్ మరో మూవీకి రెడీ అవుతుంటే యంగ్ టైగర్ ఎన్టీఆర్ ఏంటీ ఇంకా సైలెంట్ గా వున్నారంటూ ఇటీవల వార్తలు వినిపించిన విషయం తెలిసిందే. అయితే ఎన్టీఆర్ సైలెంట్ గానే రెండు చిత్రాలని పట్టాలెక్కించే పనిలో వున్నారని తెలిసింది. 'అరవింద సమేత వీర రాఘవ' తరువాత దాదాపు నాలుగేళ్ల పాటు 'ఆర్ ఆర్ ఆర్' కే కేటాయించారు. కానీ ఇప్పుడు మాత్రం అలా చేయకుండా బ్యాక్ టు బ్యాక్ సినిమాలు చేయాలని ప్లాన్ చేసుకుంటున్నారట.ఇందులో భాగంగా ఒకేసారి రెండు యాక్షన్ ఎంటర్ టైనర్ లని సెట్స్ పైకి తీసుకెళ్లా ప్యారలల్ గా షూటింగ్ పూర్తి చేసి ప్రేక్షకుల ము?ందుకు తీసుకురావాలని ప్లాన్ చేసుకుంటున్నారట. కొరటాల శివ డైరెక్షన్ లో ఎన్టీఆర్ 30 వ చిత్రం చేస్తున్నారు. గత కొన్ని రోజులుగా ఇదుగో ముహూర్తం అంటూ ఊరిస్తున్న ఈమూవీని త్వరలోనే లాంఛనంగా ప్రారంభించి వెంటనే మరో చిత్రాన్ని కూడా సెట్స్ పైకి తీసుకురావాలనుకుంటున్నారట. కొరటాల శివ డైరెక్ట్ చేస్తున్న చిత్రంలో కియారా అద్వానీ హీరోయిన్ గా నటించే అవకాశం వుందని తెలుస్తోంది.అ మూవీతో పాటు 'ఉప్పెన' ఫేమ్ బుచ్చిబాబు సాన డైరెక్షన్ లో ఓ మూవీని పట్టాలెక్కించబోతున్నారు. స్పోర్ట్స్ డ్రామా నేపథ్యంలో ఈ చిత్రాన్ని ప్లాన్ చేస్తున్నారు. ఈ చిత్రాన్ని ఏప్రిల్ లో లాంఛనంగా పూజా కార్యక్రమాలతో ప్రారంభించబోతున్నారట.ఈ రెండు చిత్రాల షూటింగ్ లని ఒకే సమయంలో పూర్తి చేయాలని పక్కా ప్లాన్ తో ఎన్టీఆర్ వున్నారని ఈ ఏడాది చివరకల్లా ఈ రెండు ప్రాజెక్ట్ లని పూర్తి చేయనున్నారని ఇన్ సైడ్ టాక్. మైత్రీ మూవీ మేకర్స్ నిర్మించనున్న బుచ్చిబాబు - ఎన్టీఆర్ చిత్రానికి 'పెద్ది' అనే టైటిల్ ని పరిశీలిస్తున్నారు. ఈ రెండు చిత్రాల తరువాత ఎన్టీఆర్ మరో ముగ్గురు క్రేజీ డైరెక్టర్లు త్రివిక్రమ్ అట్లీ ప్రశాంత్ నీల్ లతో వరుసగా సినిమాలు చేయబోతున్నారు.

# నెట్ ఫ్లిక్స్ లోకి బెబో ఎంట్రీ..ఇక దుమారామే!

ఓటీటీ వరల్డ్ క్రేజ్ గురించి చెప్పాల్సిన పనిలేదు. డే బై డే ఓటీటీ విస్తరణ అంతకంతకు పెరుగుతోంది. దీంతో సెలబ్రిటీలంతా ఓటీటీ కంటెట్ వైపు చూస్తున్నారు. ఇప్పటికే పేరున్న బాలీవుడ్ నటులు చాలా మంది ఓటీటీలోనూ తెరంగేట్రం చేసారు. హీరోలు.. హీరోలయిన్లు.. క్యారెక్టర్ ఆర్టిస్టులు అని తేడా లేకుండా ఓటీటీ సిరీస్లలో నటిస్తున్నారు. ఓటీటీకి దక్కుతోన్న ఆదరణ చూసి సొంతంగా ఓటీటీ కంపెనీలే నిర్మించడానికి టాప్ స్టార్స్ రెడీ అవుతున్నారు.ఇప్పటికే కొంత మంది ఫేమస్ సెలబ్రిటీలు కార్పోరేట్ కంపెనీలతో భాగస్వామ్యమయ్యారు. ఇక ఓటీటీ కంటెంట్ లో నటించిన వారికి మంచి పారితోషికం అందుతోంది. ప్యాకేజ్ రూపంలో ఒకేసారి కోట్ల రూపాయలు అందుకుంటున్నారు. లక్షల నుంచి కోట్లు అందుకునే సెలబ్రిటీలు ఎంతో మంది ఉన్నారు. ఔత్సాహికుల ప్రతిభను నిరూపించుకునేందుకు ఓటీటీ చక్కని వేదికగా నిలుస్తోంది. సినిమా భవిష్యత్ కూడా ఓటీటీదే. ఇలా ఓటీటీ వ్యవస్థ విస్తరణ వెనుక ఇన్ని కారణాలున్నాయి.అందుకే ఓటీటీలో కంటెంట్ లో నటించడానికి ఎక్కువ మంది ఆసక్తి చూపిస్తున్నారు. తాజాగా బాలీవుడ్ స్టార్ హీరోయిన్ కపూర్ కూడా ఓటీటీ కంటెంట్ లో నటించడానికి గ్రీన్ సిగ్నెల్ ఇచ్చింది. సుజోయ్ ఘోష్ దర్శకత్వం వహిస్తోన్న ఓటీటీ కంటెంట్ ద్వారా కరీనా లాంచ్ అవుతుంది.కరీనా నటించబోయే ఈ ఓటీటీ సిరీస్ ని 12 స్టీ ఎంటర్ టైన్ మెంట్స్- నార్తర్న్ లైట్ ఫిల్మ్స్ సంయుక్తంగా నిర్మిస్తున్నాయి. జే. శేవక్రమి- అక్షయ్ పూరి నిర్మాతలు.ఇంటరనేషనల్ స్టాండర్స్ ల్లో దీన్ని తెరకెక్కిస్తున్నారు. నెట్ ఫ్లిక్స్ అడాప్షన్ తో కొరియన్ ఓటీటీ ప్రాజెక్ట్ గా దీన్ని తెరకెక్కిస్తున్నారు. దీనికి జపనీస్ రచయిత కిగో హిగాషీనో పనిచేస్తున్నారు. 'ది డివోషన్ ఆఫ్ సస్పెక్ట్ ఎక్స్' టైటిల్ తో ఈ వెబ్ సిరీస్ ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సిరీస్ కి సంబంధించిన ఓ ట్రైలర్ ఇప్పటికే నెట్టింట వైరల్ అవుతోంది. ఇది ఇన్వస్టిగేషన్ నేపథ్యంలో సాగే సస్పెన్స్ థ్రిల్లర్ సిరీస్ లా అనిపిస్తుంది.ఇలాంటి సిరీస్ ల్ని అందించడం లో నెట్ ఫ్లిక్స్ అగ్రగామి సంస్థగా మార్కెట్ లో దూసుకుపోతున్న సంగతి తెలిసిందే. తాజాగా కరీనా ఎంట్రీతో నెట్ ఫ్లిక్స్ కి ఇండియాలో ఆదరణ మరింత పెరిగే ఛాన్స్ ఉంది. ఇక కరీనా సినిమాల విషయానికి వస్తే అమీర్ ఖాన్ కథానాయకుడిగా నటిస్తోన్న 'లాల్ సింగ్ చద్దా'లో హీరోయిన్ గా నటిస్తోంది. ఆగస్టులో ఈ చిత్రం ప్రేక్షకుల ముందుకు రానుంది.



# ఏ ముహూర్తానా పాక్ గడ్డపై అడుగుపెట్టిందో అన్నీ విచిత్ర పరిస్థితులే; తాజాగా



ఆస్ట్రేలియా జట్టు ఏ ముహుర్తానా పాక్ గడ్డపై అడుగుపెట్టిందో కానీ.. అన్ని విచిత్ర పరిస్థితులే ఎదురవుతున్నాయి. 24 ఏళ్ల అనంతరం పాకిస్తాన్‌లో మూడు టెస్టులు, మూడు వన్డేలు, ఒక టి20 ఆడేందుకు ఆస్ట్రేలియా వచ్చింది. వచ్చీ రాగానే పెషావర్‌లో బాంబుల మోత.. తమను స్వాగతం పలికామా అన్నట్లుగా ఆస్ట్రేలియా జట్టును ఉలిక్కిపడేలా చేసింది. మసీదును లక్ష్యంగా చేసుకొని ఉగ్రవాదులు జరిపిన ఈ దాడిలో సుమారు 50 మంది మృతి చెందినట్లు తెలుస్తోంది. అప్పటికే పక్కనే ఉన్న రావల్పిండి సిటీలో పాకిస్తాన్, ఆస్ట్రేలియా మధ్య తొలి టెస్టు మ్యాచ్ మొదలైంది.సిరీస్ రద్దయ్యే అవకాశాలు ఉన్నట్లు అనుమానాలు వచ్చినప్పటికి.. పీసీబీ ఆసీస్ ఆటగాళ్ల భద్రత మాదేనని పేర్కొంది. అలా మొదటి టెస్టు పూర్తి కాగానే.. దేశంలో రాజకీయ సంక్షోభ దుమారం రేగింది. అధికారంలో ఉన్న ఇమ్రాన్‌ఖాన్ ప్రభుత్వం ఒక్కసారిగా సంక్షోభంలో పడింది. ఇమ్రాన్‌ఖాన్‌కు వ్యతిరేకంగా తమ పార్టీలు ఎంపీలు, మంత్రులు రాజీనామాలు చేస్తున్నారు. ప్రతిపక్షాలు తీసుకొచ్చిన అవిశ్వాస తీర్మానం కారణంగా ప్రధాని ఇమ్రాన్ ఖాన్ ప్రభుత్వం ఇరకాటంలో పడింది.తాజాగా రాజకీయ సంక్షభం సెగ పాకిస్తాన్- ఆస్ట్రేలియా సిరీస్‌ను తాకింది. మూడు వన్డేల సిరీస్‌తో పాటు ఏకైక టి20 మ్యాచ్ మార్చి 29, 31, ఏప్రిల్ 2, 4 తేదీలలో రావల్పిండి వేదికగా జరగాల్సి ఉంది. అయితే రాజకీయ సంక్షోభం కారణంగా పాక్ రాజధాని ఇస్లామాబాద్‌తో పాటు పక్కనే ఉన్న రావల్పిండిలో అల్లర్లు తలెత్తే ప్రమాదం ఉంది. అందుకే ముందు జాగ్రత్త చర్యగా రావల్పిండి నుంచి లాహోర్‌కు మ్యాచ్ వేదికలను మారుస్తున్నట్లు దేశ విదేశాంగ మంత్రి షేక్ రషీద్ ఒక ప్రకటనలో వెల్లడించారు. లాహోర్ వేదికగా అవే తేదీల్లో మూడు వన్డేలు, ఒక టి20 మ్యాచ్ జరగనుందని ఆయన స్పష్టం చేశారు.కాగా ఇప్పటికే మూడో టెస్టు కోసం ఇరుజట్లు లాహోర్‌లోని గడాఫీ వేదికగా ఆడనున్నాయి. ఇక సిరీస్‌లో మిగిలిన మ్యాచ్‌లు కూడా అక్కడే ఆడనున్నట్లు పీసీబీ తెలిపింది. ఈ విషయాన్ని ఇప్పటికే క్రికెట్ ఆస్ట్రేలియాకు తెలిపామని.. వారు తమ క్రికెటర్ల క్షేమ సమాచారాలు మాత్రమే అడిగారని.. సిరీస్ ముగిశాక జాగ్రత్తగా పంపించాలని కోరారని షేక్ రషీద్ తెలిపారు.

## మిథాలీ సేనకు షాక్.. సెమీ ఫైనల్‌కు దూసుకెళ్లిన ఆసీస్

ఐసీసీ మహిళా వన్డే ప్రపంచకప్-2022లో భాగంగా ఇప్పటి వరకు నాలుగు మ్యాచ్‌లు గెలిచి అజేయంగా నిలిచిన ఆస్ట్రేలియా మరోసారి అదరగొట్టింది. భారత మహిళా జట్టుతో ఆక్లాండ్ వేదికగా శనివారం జరిగిన మ్యాచ్‌లో గెలుపొందింది. తద్వారా ఈ టోర్నీలో ఐదో విజయాన్ని నవోదు చేసింది.ఆఖరి వరకు ఉత్కంఠ రేపిన మ్యాచ్‌లో 6 వికెట్ల తేడాతో భారత్‌ను ఓడించి సగర్వంగా సెమీ ఫైనల్‌లో అడుగుపెట్టింది. మరోవైపు.. సెమీస్ ఆశలు సజీవంగా ఉంచుకోవాలంటే తప్పక గెలవాల్సిన మ్యాచ్‌లో ఓటమి పాలైన మిథాలీ సేనకు నిరాశ తప్పలేదు.మిథాలీ సేనతో మ్యాచ్‌లో భాగంగా టాస్ గెలిచిన ఆస్ట్రేలియా బౌలింగ్ ఎంచుకుంది. ఆసీస్ కెప్టెన్ మెగ్ లానింగ్ ఆహ్వానం మేరకు బ్యాటింగ్‌కు దిగిన భారత్‌కు శుభారంభం లభించలేదు.

EDITED, PRINTED,PUBLISHED AND OWNED BY **AVULA VIJAYA BHASKARA REDDY** PRINTED AT **SRI SANTOSH PRINTERS SHOP NO. 67-58/A2,OPP TAMIL NADU MERCANTILE BANK, OLD BUSTAND, KURNOOL- 518 001. ANDHRA PRADESH.**
**PUBLISHED FROM AVULA HUSSAIN REDDY COLONY,7-5-230, NANDYAL ROAD ALLAGADDA-518 543. KURNOOL DISTRICT. ANDHRA PRADESH. EDITOR : AVULA VIJAYA BHASKARA REDDY. RNI No : APTEL/2019/77190**